విలేకరులు కావలెను

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వెలుబడుతున్న

ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA
రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక

తెలుగు మాసపత్రిక నందు పనిచేయుటకు జర్నలిజంపై ఆసక్తి కలిగిన ప్రతి మండలం నుండి విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి
+91 9381910611 , 7989289492



www.prajaswecha.com

# ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA

రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక





హైదరాబాద్ | సంచిక : 1 | సంపుటి : 205 | ఎడిటర్ : తరిగొప్పుల లక్ష్మి మహేందర్ ప్రజాపతి | జనవరి 2025 | వెల : రూ 10/-





## జీవ ఇంధనాల అభివృద్ధిపై భారతదేశం దృష్టి

- దేశంలో ఎలక్ట్రిక్ మొబిలిటీ విస్తరణకు చర్యలు
- భారత్ మొబిలిటీ ఎక్స్ పో 2025' ప్రారంభోత్సవంలో ప్రధాని మోడీ


**న్యూఢిల్లీ,**
దేశంలో ఎలక్ట్రిక్ మొబిలిటీ విస్తరణకు ప్రభుత్వం విధానపరమైన నిర్ణయాలు తీసుకుంటోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. గ్రీన్ టెక్నాలజీ, ఈవీలు, హైడ్రోజన్ ఇంధనం, జీవ ఇంధనాల అభివృద్ధిపై భారతదేశం -మిగతా 3 లో



## పాత రేషన్ కార్డులు తొలగించడం లేదు

- కొత్త కార్డులను 26 నుంచి ఇవ్వబోతున్నాం
- విపక్షాల దుష్ప్రచారం నమ్మకండి
- మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టీకరణ

**కరీంనగర్,**
పాత రేషన్ కార్డులు తొలగిస్తారనే ప్రచారం అబద్ధమని, అలాంటివి నమ్మవద్దని రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ నెల26 నుండి కొత్త రేషన్ కార్డులు ఇచ్చే పక్రియ కోసం గ్రామాల్లో సర్వే జరుగుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. 2 కోట్ల 81 లక్షల మందికి ఇప్పటికే తెలంగాణలో 90 -మిగతా 3 లో



## మా మేనిఫెస్టోను కాపీ కొట్టారు

బీజేపీ సంకల్ప్ పాత్రపై కేజ్రీవాల్ విమర్శలు

**న్యూఢిల్లీ,**
అసెంబ్లీ ఎన్నికల కోసం బీజేపీ ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టో 'సంకల్ప్ పాత్ర-1'పై ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ విమర్శలు గుప్పించారు. బీజేపీ ఇచ్చిన హామీలు 'ఆమ్ ఆద్మీ పార్టీ' నుంచి కాపీ కొట్టారని, తమ పార్టీ ఎంచుకున్న మార్గానే వాళ్లు అనుసరించేటప్పుడు ఏమాత్రం విజన్ లేని బీజేపీని -మిగతా 3 లో

## స్కిల్ యూనివర్సిటీకి ఐటీఈ

# ప్రోత్సాహం

### సింగపూర్ తో ఒప్పందం చేసుకున్న తెలంగాణ..

- పలు అంశాలపై సీఎం రేవంత్ బృందం చర్చలు..
- సింగపూర్ యూనివర్సిటీతో ఎంఓయూ
- సీఎం రేవంత్ సమక్షంలో కీలక ఒప్పందం
- యూనివర్సిటీతో ఒప్పందం పత్రంపై సంతకాలు
- సీఎం రేవంత్ విజ్ఞప్తికి అంగీకరించిన సింగపూర్ మంత్రి..



**హైదరాబాద్,**
నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ.. సింగపూర్ ప్రభుత్వ ఆధీనంలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఐటీఈ) సంస్థతో ఎంఓయు కుదుర్చుకుంది. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు, స్పెషల్ సీఎస్ జయేశ్ రంజన్‌ల సమక్షంలో యూనివర్సిటీ వైస్ -మిగతా 3 లో



## స్థానిక ఎన్నికలపై నజర్

సంక్రాంతి పలకరింపులతో హల్‌చల్

**నిజామాబాద్,**
బీసీ గణనకు సంబంధించి కమిషన్ల రిపోర్టులు రాగానే రిజర్వేషన్లు పెంచి లోకల్ బాడీ ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. గత ఫిబ్రవరిలోనే సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసింది. జులైలో ఎంపీటీసీ, జడ్పీటీసీలు కూడా మాజీలయ్యారు. ఈనెలలో మున్సిపల్ కార్పొరేషన్లు, కౌన్సిళ్ల టర్మ్ పూర్తికానుంది. దీంతో రూరల్, అర్బన్ లోకల్ బాడీలకు -మిగతా 3 లో

## పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌కు 14 ఏళ్ల జైలు శిక్ష

- అల్ ఖాదిర్ కేసులో ఇమ్రాన్‌కు వరుస ఎదురుదెబ్బలు

**లాహోర్,**
పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌కు వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. అల్ ఖాదిర్ కేసులో ఇమ్రాన్, ఆయన సతీమణి బుష్రా బీబీ దోషులుగా తేలారు. ఆయనకు 14 ఏళ్ల జైలు శిక్ష పడగా.. ఆమెకు ఏడేళ్ల జైలు శిక్షను విధిస్తూ న్యాయస్థానం తీర్పు ఇచ్చింది. అడియాలా జైలులో కట్టుదిట్టమైన భద్రత నడుమ న్యాయమూర్తి -మిగతా 3 లో





## 31నుంచి బడ్జెట్ సమావేశాలు


-జనవరి 31 నుంచి ఫిబ్రవరి 13 వరకు తొలి విడత
-మార్చి 10 నుంచి ఏప్రిల్ 4 వరకు రెండో విడత సమావేశాలు

**న్యూఢిల్లీ,**
పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల తేదీలు ఖరారయ్యాయి. రెండు విడతల్లో ఈ సమావేశాలు నిర్వహించనున్నారు. జనవరి 31 నుంచి ఫిబ్రవరి 13 వరకు తొలి విడత, మార్చి 10 నుంచి -మిగతా 3 లో

## ఆరు గ్యారెంటీలని..

# అర గ్యారెంటీ అమలు

- సర్పంచ్ ఎన్నికల్లో ఎక్కడిక్కడ నిలదీయండి
- బాకీలు అడిగినట్లుగా కాంగ్రెస్ నేతలను అడగండి
- తులం బంగారం సహా హామీలపై ప్రశ్నించండి
- చేవెళ్లలో ఉప ఎన్నిక రావడం ఖాయం
- హామీలను అమలు చేసేదాకా నిలదీస్తూనే ఉంటా
- షాబాద్ బీఆర్ఎస్ రైతు ధర్నా సభలో కేటీఆర్




**రంగారెడ్డి,**
కాంగ్రెస్ నాయకులు ఆరు గ్యారెంటీలని చెప్పి.. అర గ్యారెంటీ మాత్రమే అమలు చేశారని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ధ్వజమెత్తారు. కేవలం ఉచిత బస్సు ప్రయాణంతో సరిపెట్టారని ఆరోపించారు. చేవెళ్ల నియోజకవర్గం షాబాద్‌లో నిర్వహించిన రైతు దీక్షలో ఆయన ప్రసంగించారు. -మిగతా 3 లో



## అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు

-పారదర్శకంగా గ్రామసభల్లో లబ్ధిదారుల ఎంపిక
-త్వరలో సర్వేయర్ల, గ్రామాధికారుల నియామకం
-రెవెన్యూ, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి

**హైదరాబాద్,**
ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం నిరంతర పక్రియ అని, అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇచ్చే బాధ్యత ఈ ప్రభుత్వానిదేనని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. మొదటి విడతలో ఇండ్ల స్థలం -మిగతా 3 లో

# మహారాష్ట్రలో ఘోర రోడ్డు ప్రమాదం

మినీ వ్యాన్, బస్సు ఢీకొని 9 మంది దుర్మరణం



**పూణే,**
పూణే-నాసిక్ హైవేపై మినీ వ్యాన్, బస్సు ఢీకొని ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో 9 మంది మరణించారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు నారాయణగావ్‌లో ఈ ప్రమాదం జరిగింది. జున్నార్ గ్రామాల నుండి ప్రజలను తీసుకెళ్తున్న వ్యాన్ ప్రమాదానికి గురైంది. ట్రక్కు వెనుక భాగాన్ని ఢీకొట్టిన మినీ వ్యాన్ నియంత్రణ కోల్పోయి రోడ్డు పక్కన ఆగి ఉన్న బస్సును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వ్యాన్ పూర్తిగా ధ్వంసమైంది. వ్యాన్ ప్రయాణికులతో నారాయణగావ్‌కు వెళుతోంది. బ్రేక్‌డౌన్ కారణంగా బస్సును హైవే పక్కన నిలిపివేశారు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో ప్రయాణికులు లేరు.

# మంచు కుటుంబంపై పోలీసుల కేసు

-పరస్పర ఆరోపణలతో ఫిర్యాదులు



**తిరుపతి,**
మంచు కుటుంబంలో మళ్లీ వివాదం రేకెత్తింది. డెయిరీ ఫాం గేటు వద్ద జరిగిన ఘటనపై ఇరువర్గాలు ఫిర్యాదులు చేశారు. ఈ నేపథ్యంలో చంద్రగిరిలో మంచు ఫ్యామిలీపై 2 కేసులు నమోదు చేశారు. మోహన్ బాబు పిఎ చంద్రశేఖర్ నాయుడు ఫిర్యాదుతో మంచు మనోజ్, మౌనికలతో పాటు మరో ముగ్గురిపై కేసులు పెట్టారు. మోహన్‌బాబు పిఎతో పాటు ఎంబియు సిబ్బంది 8 మందిపై కేసులు నమోదు చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తిరుపతిలోని మోహన్‌బాబు యూనివర్సిటీ వద్ద సినీ నటుడు మంచు మనోజ్ యూనివర్సిటీ లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించడంతో పోలీసులు అడ్డుకున్నారు. మా తాత, నాయనమ్మ సమాధులను చూసేందుకు వచ్చానని, అనుమతి కావాలని పోలీసులను మనోజ్ అడగడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొన్న విషయం తెలిసిందే. గత కొన్ని రోజుల మంచు కుటుంబంలో గొడవలు జరుగుతున్న విషయం తెలిసిందే.

# బ్రిజేష్ ట్రిబ్యునల్ ఉత్తర్వులను స్వాగతిస్తున్నాం

-ఇది ముమ్మాటికీ నాటి కెసిఆర్ ప్రభుత్వ విజయం
-ప్రకటనలో వెల్లడించిన మాజీమంత్రి హరీష్ రావు



**హైదరాబాద్**
కృష్ణా జలాల పంపిణీపై బ్రిజేష్ ట్రిబ్యునల్ ఇచ్చిన ఆదేశాలు.. ముమ్మాటికీ కేసీఆర్ ప్రభుత్వ విజయమే అని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. శుక్రవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. మొదటి నుంచి సెక్షన్ 3 ప్రకారం నీళ్లు కేటాయించాలని కేసీఆర్ పట్టుబట్టారని పేర్కొన్నారు. తాజాగా ట్రిబ్యునల్ ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను స్వాగతిస్తున్నామని హరీష్ రావు తన ప్రకటనలో తెలిపారు. దీన్ని కూడా కాంగ్రెస్ ప్రభుత్వం తమ ఘనతగా చెప్పుకోవడం సిగ్గు చేటు అని విమర్శించారు. అసలు ఏపీ పునర్విభజన చట్టం, సెక్షన్ 89 తెచ్చిందే కేంద్రంలోని కాంగ్రెస్ సర్కార్ అని గుర్తు చేశారు హరీష్ రావు. కృష్ణా జలాల విషయంలో తెలంగాణకు తీవ్ర అన్యాయం చేసిందే కాంగ్రెస్ అని విమర్శించారు. ఆ తప్పిదాన్ని సరిదిద్దేందుకు బీఆర్ఎస్‌కు పదేళ్ల కాలం పట్టిందన్నారు. కృష్ణా నదిలో న్యాయమైన వాటా దక్కే వరకు బీఆర్ఎస్ రాజీలేని పోరాటం చేస్తుందని హరీష్ రావు మరోసారి స్పష్టం చేశారు.కృష్ణా జలాల వివాదంపై బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ కీలక ఉత్తర్వులిచ్చింది. కేంద్ర ప్రభుత్వం 2023లో అంతర్రాష్ట జల వివాద చట్టంలోని సెక్షన్ 3 ప్రకారం జారీ చేసిన తదుపరి టర్మ్స్ ఆఫ్ రెఫరెన్స్‌పై మొదట రెండు రాష్ట్రాల వాదనలు వినాలని ట్రిబ్యునల్ నిర్ణయించింది. దీనిపై వాదనలు పూర్తయిన తరువాత ఏపీ పునర్విభజన చట్టంలోని సెక్షన్ 89 ప్రకారం తుది వాదనలు వింటామని ట్రిబ్యునల్ ధర్మాసనం పేర్కొంది. తదుపరి వాదనలను ఫిబ్రవరి 19వ తేదీ నుంచి 21వ తేదీ వరకు జరుగనున్నాయి. ట్రిబ్యునల్ ఉత్తర్వుల ప్రకారం.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేటాయించిన నీటిలో ఎవరి వాటా ఎంత అన్నదానిపై వాదనలు విన్న తర్వాతే ప్రాజెక్టుల వారీగా నీటి కేటాయింపుల అంశాన్ని ట్రిబ్యునల్ చేపట్టను

# అమెరికన్లను దెబ్బతీస్తున్న హెచ్-1బి

-లాకెన్ రిలే చట్టాన్ని సవరించాల్సిందే
-అమెరికన్ సెనెటర్ బెర్నీ శాండర్స్ వెల్లడి



**వాషింగ్టన్**
మంచి వేతనాలను అందుకునే అమెరికన్ ఉద్యోగులను తొలగించేందుకే హెచ్-1బి ఉపయోగపడుతోందని అమెరికన్ సెనెటర్ బెర్నీ శాండర్స్ ఆరోపించారు. వారి స్థానంలో తక్కువ వేతనాలకే వచ్చే విదేశీ కార్మికులను అధిక సంఖ్యలో కంపెనీలు నియమించుకుంటున్నాయని ఆక్షేపించారు.
హెచ్-1బి వీసాలకు అవకాశం కల్పిస్తున్న లాకెన్ రిలే చట్టాన్ని సవరించాలని కోరుతూ చట్టసభలో ఒక ప్రతిపాదనను శాండర్స్ ప్రవేశపెట్టారు. హెచ్-1బి వీసాల కోసం కంపెనీలు చెల్లించాల్సిన రుసుములను రెట్టింపు చేయాలన్నారు. దీని ద్వారా లభించే ఆదాయంతో 20వేల మంది అమెరికన్ విద్యార్థులకు ఉపకార వేతనాలు ఇవ్వవచ్చని తెలిపారు. హెచ్-1బి కార్మికులకు కంపెనీలు చెల్లించే వేతనాలను కూడా భారీగా పెంచాలని డిమాండ్ చేశారు. తక్కువ వేతనాలకు వచ్చే విదేశీ కార్మికులను నియమించుకోవడం ద్వారా కార్పొరేట్ సంస్థలు భారీ మొత్తంలో డబ్బును మిగుల్చుకుంటున్నాయని విమర్శించారు. హెచ్-1బి వీసాలను సమర్థిస్తున్న టెస్లా అధినేత ఎలాన్ మస్క్, భారతీయ అమెరికన్ పారిశ్రామికవేత్త వివేక్ రామస్వామిలపైనా శాండర్స్ విమర్శలను సంధించారు. ఇదిలావుంటే హెచ్1బి వీసాలను ఆసియావాసులు దుర్వినియోగం చేస్తున్నారనీ ఉన్నత చదువుకోసం వచ్చి ఉద్యోగాలను ఎగరేసుకుపోతున్నారనీ ప్రస్తుతం అమెరికాలో చెలరేగిపోతున్న విమర్శల వెనుకా మెజారిటీ శ్వేత జాతీయవాద విపరీత పోకడ వెల్లడవుతోంది. అమెరికన్ల ఉద్యోగాలను కొట్టేస్తున్నారన్న విమర్శ ఆసియావాసులను ప్రస్తుతం క్షోభపెడుతోంది. చదువు ముగిసిన తర్వాత ఉద్యోగాలు చేసే కాలాన్ని బాగా తగ్గించాలనే డిమాండు ఊపందుకుంటోంది. ఇది జరిగితే బాగా నష్టపోయేది భారతీయులే. లక్షలు ఖర్చుపెట్టి అమెరికాలో చదువుతున్న మొత్తం విదేశీ విద్యార్థుల్లో 25 శాతం పైగా భారతీయులే ఉన్నారు. అభివృద్ధిచెందిన దేశాల్లో పలుచోట్ల జనాకర్షణ, ఉన్మాద నినాదాలతో ఓట్ల రాజకీయాల్లో పైచేయి సాధిస్తున్న నేతల్లో విపరీత జాతీయవాద పోకడలు లేని వాళ్లను వేళ్లమీద లెక్కపెట్టొచ్చు. ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా గెలవటంతో ఈ విపరీతం మోతాదు బాగా మించిపోతోంది. వలసదారులకు, శరణార్థులకు సురక్షిత ప్రదేశంగా ఉన్నప్పుడే అమెరికా ఘనత గొప్పగా ఉంటుందని కెన్నడి ప్రగాఢంగా చెప్పారు. పౌరహక్కుల చట్టమే లేకపోతే ప్రజాస్వామ్యం గురించి, సమన్యాయపాలన గురించి, పౌరసమానత్వం గురించి ప్రపంచానికి నీతులు చెప్పే నైతిక అర్హతే అమెరికాకు ఉండేది కాదు. అవకాశాల సీమగా ఇప్పటికీ అమెరికాను పరిగణిస్తూ ప్రతి ఏటా దాదాపు లక్షల మందికి పైగా ప్రజలు అక్కడికి వెళుతున్నారు. 2021-24 మధ్య సగటున ఏడాదికి 24లక్షల మంది అక్కడికి చేరుకున్నారు. 1965 నుంచి చూస్తే క్రమేపీ లాటిన్ అమెరికా, ఆసియా నుంచి అమెరికాకు వెళ్లే వారి సంఖ్య బాగా పెరిగింది. మొత్తం వలసదారుల్లో 50 శాతం వారే ఉన్నారు. ఇంతగా వెళుతున్న వారందరికీ అక్కడ సమభావనతో సమాజంలో స్వాగతం

# ఆదివారం నుంచి గాజాలో కాల్పుల విరమణ

-అంగీకరించిన ఇజ్రాయిల్, హమాస్
- ప్రకటించిన కతార్ ప్రధాని
- తక్షణమే మానవతా సాయానికి చర్యలు : ప్రపంచ నేతల వినతి



**గాజా, జెరూసలెం**
గాజాలో ఇజ్రాయిల్ సైనిక బలగాలు గత 15మాసాలకు పైగా కొనసాగిస్తున్న భీకర దాడులకు విరామం ఇస్తూ కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిందని ఈ చర్చలకు మధ్యవర్తిత్వం వహించిన దేశాల్లో ఒకటైన కతార్ ప్రధాని షేక్ మహ్మద్ బిన్ అబ్దుల్ రహమాన్ గురువారం ప్రకటించారు. ఈ కాల్పుల విరమణ ఆదివారం (19వ తేదీ) నుండి అమల్లోకి వస్తుందని ఆయన తెలిపారు. బందీలు, ఖైదీల విడుదల ప్రక్రియ కూడా అప్పుడే ప్రారంభమవుతుందని చెప్పారు. ఈ కాల్పుల విరమణ శాశ్వతంగా అమలు కావాలన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. కతార్ రాజధాని దోహాలో గత కొన్ని వారాలుగా అనేక అడ్డంకుల మధ్య కొనసాగుతూ వచ్చిన ఈ చర్చల్లో ఎట్టకేలకు ఈ ఒప్పందం కుదిరింది. హమాస్ చెరలో వున్న బందీలను దశలవారీగా విడుదల చేసేందుకు, అందుకు ప్రతిగా ఇజ్రాయిల్ జైళ్లలో మగ్గుతున్న వందలాదిమంది పాలస్తీనా ఖైదీలను విడుదల చేసేందుకు ఈ ఒప్పందం హామీ కల్పించింది. అలాగే వరుసగా కొనసాగిన దాడులతో ఇళ్లు, వాకిళ్లు వీడి ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయిన వేలాదిమంది పాలస్తీనియన్లను తిరిగి వారి స్వస్థలాలకు చేరేందుకు కూడా ఈ ఒప్పందం అనుమతిస్తోంది. విచక్షణారహితంగా జరిగిన దాడులతో పూర్తిగా వినాశనం చోటు చేసుకున్న గాజాకు ఎంతగానో అవసరమైన మానవతా సాయాన్ని అందించేందుకు కూడా ఈ ఒప్పందం వీలు కల్పిస్తోంది. ఒప్పందంలోని కొన్ని అంశాలపై ఇజ్రాయిల్ పాలక సంకీర్ణంలో చివరి నిముషంలో కొన్ని విభేదాలు తలెత్తినప్పటికీ చివరకు ఈ ఒప్పందానికి ఇజ్రాయిల్ కేబినెట్ కూడా అనుకూలంగా ఓటు వేసింది. తాము కూడా పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు కట్టుబడి వున్నామని హమాస్ సీనియర్ అధికారి ప్రకటించారు. హమాస్ విధించిన షరతులన్నీ నెరవేరేలానే ఈ ఒప్పందం కుదిరిందని ఇజ్జాత్ అల్ రిషిక్ చెప్పారు. ఇజ్రాయిల్ బలగాలు గాజా నుండి పూర్తిగా వైదొలగాలని, నిర్వాసితులందరూ వెనక్కి తిరిగి వచ్చేందుకు అనుమతించాలని హమాస్ కోరుతూ వస్తోంది. అలాగే ఈ ఒప్పందం శాశ్వత కాల్పుల విరమణకు దారి తీయాలని వాంఛిస్తోంది. ఇప్పటివరకు గాజా దాడుల్లో 46,788మంది మరణించారు. 1,10,453మంది గాయపడ్డారు.

# ఆకాశంలో పేలిన ఎలాన్ మస్క్‌కు చెందిన స్టార్‌షిప్ రాకెట్..

**-హైదరాబాద్**



ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్ 'స్టార్‌షిప్' కీలక ప్రయోగం విఫలమైంది. అధునాతన సాంకేతికతతో ఆధునికీకరించి, తొలి టెస్ట్‌గా పేలోడ్ మాక్ శాటిలైట్లను ప్రయోగించగా ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. గురువారం సాయంత్రం 5.38 గంటల సమయంలో అమెరికాలోని టెక్సస్ నుంచి ప్రయోగించిన కొన్ని నిమిషాలకే స్టార్‌షిప్ ఆకాశంలో ముక్కలుముక్కలైంది. అప్‌గ్రేడ్ చేసిన స్టార్‌షిప్‌తో స్పేస్‌ఎక్స్ మిషన్ కంట్రోల్ సంబంధాలు తెగిపోయాయని శాస్త్రవేత్తలు వెల్లడించారు. రాకెట్ ప్రోగ్రామ్‌ను మార్చాల్సి ఉంటుందని చెప్పారు. 'అప్పర్ స్టేజ్'లో సమస్య ఉన్నట్టు అర్థమవుతోందని స్పేస్‌ఎక్స్ కమ్యూనికేషన్స్ మేనేజర్ డాన్ హుట్ ధ్రువీకరించారు. రాకెట్ పేలుడుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. హైతీ రాజధాని పోర్ట్- ఔ-ప్రిన్స్ గగనతలంలో స్టార్‌షిప్ పేలిపోగా నారింజ రంగులో అగ్ని గోళాలు ఎగసిపడ్డాయి. పొగ కూడా వ్యాపించింది. స్టార్‌షిప్ శకలాలు ఆకాశంలో చెల్లాచెదురు కావడంతో గల్ఫ్ ఆఫ్ మెక్సికో మీదుగా విమానాల రాకపోకలపై అప్రమత్తత ప్రకటించారు. విమానాలకు శకలాలు తగిలితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉండడంతో జాగ్రత్తగా ఉండాలని స్పేస్‌ఎక్స్ సూచించింది. అటువైపుగా విమానాలు రాకుండా చూసుకోవాలని కోరింది. కాగా, గతేడాది మార్చిలో కూడా స్టార్‌షిప్‌కు 'అప్పర్ స్టేజ్' సమస్య ఉత్పన్నమైంది. అప్పుడు కూడా విమాన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

# సైఫ్ అలీఖాన్‌పై దాడి..నిందితుడు అరెస్ట్



**హైదరాబాద్**
బాలీవుడ్ స్టార్ హీరో సైఫ్ అలీఖాన్‌పై దాడి జరిగిన ఘటనలో కీలక పరిణామం చోటు చేసుకుంది. బాలీవుడ్ స్టార్ హీరో సైఫ్ అలీఖాన్‌పై దాడి జరిగిన ఘటనపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. సైఫ్‌పై దాడి చేసిన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. బాంద్రా పోలీస్ స్టేషన్‌లో నిందితుడిని ముంబై పోలీసులు విచారిస్తున్నారు. ఇప్పటికే సీసీ కెమెరాల్లో రికార్డు అయిన నిందితుడిని ఫోటోను పోలీసులు రిలీజ్ చేసిన సంగతి తెలిసిందే. కాగా, పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఆ దుండగుడు దొంగతనం కోసమే అతని ఇంట్లోకి వెళ్లారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తప్పించుకునే మార్గం ద్వారా దుండగుడు సైఫ్ నివాసంలోకి ఎంట్రీ ఇచ్చాడు. అయితే నిందితుడు దాడి చేసే ముందు సైఫ్ ని కోటి రూపాయలు డిమాండ్ చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. ఇందుకు ఒప్పుకోకపోవడంతో దుండగుడు దాడి చేసినట్లు ప్రాథమికంగా గుర్తించారు.

# స్కిల్ యూనివర్సిటీకి ఐటీఈ ప్రోత్సాహం

(మొదటి తరువాయి)

ఛాన్సలర్ సుబ్బారావు, ఐటీఈ డిప్యూటీ డైరెక్టర్ ఫాబియన్ చియాంగ్ శుక్రవారం ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. సింగపూర్ ఐటీఈ పదో తరగతి చదివే విద్యార్థుల స్థాయి నుంచి చదువు పూర్తి చేసిన యువత, ఆసక్తి ఉన్న ఏ వయసు వారికైనా.. పరిశ్రమలు, ఐటీ సంస్థల సహకారంతో జాబ్ రెడీ శిక్షణను ఇస్తుంది. 'స్కిల్స్ ఫర్ ఫూచర్, స్కిల్స్ ఫర్ లైఫ్' అనే నినాదంతో పనిచేస్తున్న ఐటీఈలో ప్రస్తుతం 28 వేల మంది శిక్షణ పొందుతున్నారు. మొత్తం వంద ఫుల్ టైమ్ కోర్సులకు ఆన్‌లైన్, క్యాంపస్ శిక్షణ ఇక్కడ అందుబాటులో ఉంటుంది. ఐటీఈకి ఐదు వేల పరిశ్రమలతో భాగస్వామ్యం ఉంది. పరిశ్రమలు తమకు అవసరమైన మానవ వనరులకు ఐటీఈలో నేరుగా శిక్షణనిచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాయి. అదే స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్రంలో ఏర్పాటైన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ తన శిక్షకులకు ఐటీఈతో ట్రెయినింగ్ (ట్రెయినింగ్ ఫర్ ట్రెయినర్స్) ఇప్పించేలా ఒప్పందరం కుదుర్చుకుంది. తాజా ఎంఓయు వల్ల సింగపూర్ ఐటీఈ పాఠ్యాంశాలను మనం ఉపయోగించుకునే వీలు కలుగుతుంది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సింగపూర్‌లో పర్యటిస్తున్నారు. ముఖ్యమంత్రి తొలిరోజు పర్యటనలోనే ఈ కీలక ఒప్పందం జరిగింది. ముఖ్యమంత్రి సింగపూర్ పర్యటనలో తొలిరోజు విశేష స్పందన లభించింది. పర్యటనలో భాగంగా సింగపూర్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఐటీఈ) క్యాంపస్‌ను సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు సందర్శించారు. అక్కడ నిర్వహిస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులు, అధునాతన సదుపాయాలను పరిశీలించారు. అక్కడ శిక్షణను అందిస్తున్న దాదాపు 20 రంగాలకు చెందిన నిపుణులు, కాలేజీ సిబ్బందిని కలిసి మాట్లాడారు. అనంతరం ఐటీఈ ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి బృందం చర్చలు జరిపింది. హైదరాబాదులోని ఫోర్త్ సిటీలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసి యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి సహకరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. వివిధ రంగాల్లో యువతకు ఉపాధి కల్పించేందుకు మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా వివిధ కోర్సులు నిర్వహిస్తున్న తీరును ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. నైపుణ్యాల అభివృద్ధి (స్కిల్ డెవెలప్మెంట్) శిక్షణలో భాగస్వామ్యం కోసం పరస్పర సహకారం అందించాలని కోరారు. దీనిపై ఐటీఈ ప్రతినిధి బృందం సానుకూలంగా స్పందించింది. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీతో కలిసి పని చేసేందుకు సంసిద్ధతను వ్యక్తం చేసింది. చర్చల అనంతరం నైపుణ్యాల అభివృద్ధిలో కలిసి పని చేసేందుకు ఐటీఈ, స్కిల్ యూనివర్సిటీ పరస్పర అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. త్వరలోనే ఐటీఈ ప్రతినిధి బృందం హైదరాబాద్‌ను సందర్శించనుంది. కాగా.. ఉదయం సింగపూర్ విదేశాంగ మంత్రి వీవీఎన్ బాలకృష్ణతో రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. గ్రీన్ ఎనర్జీ, మూసీ పునరుజ్జీవనం, పర్యాటకం, విద్య, ఐటీ, నైపుణ్య నిర్మాణంపై వారు చర్చించారు. సీఎంతో పాటు ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్‌రంజన్ భేటీలో పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికలపై నజర్

(మొదటి తరువాయి)

వరుసగా ఎన్నికలు జరగనున్నాయి. కొత్తగా 15 గ్రామ పంచాయతీలు ఏర్పడడంతో జిల్లాలో పంచాయితీల సంఖ్య 545 పెరిగింది. ఈ క్రమంలో జిల్లాలో అప్పుడే స్థానిక హడావిడి మొదలయ్యింది. ముఖ్యంగా పంచాయితీ సర్పంచ్ పదవులకు పోటీ చేసే వారంతా ఇప్పటి నుంచే గ్రామాల్లో కరచాలనాలు మొదలు పెట్టారు. పలకరింపులు చేస్తున్నారు. బాగున్నావా అని ఆత్మీయంగా చూస్తున్నారు. సంక్రాంతి సందర్భంగా గ్రామాల్లో ఇదే సందడి కనిపించింది. వాడు సర్పంంకు పోటీ చేస్తున్నాడనే కామెంట్స్ కూడా బాగానే వినిపించాయి. ఇకపోతే జిల్లాలో మహిళా ఓటర్లు అధిక సంఖ్యలో ఉన్నారు. జిల్లా పరిధిలో ఐదు అసెంబ్లీ నియోజక వర్గాలతో పాటు బాన్సువాడ సెగ్మెంట్‌లోని కొన్ని మండలాలున్నాయి. తుది ఓటర్ల జాబితాను అధికారులు ఇటీవల ప్రకటించారు. తాజాగా జిల్లాలో 14,35,214 మంది ఓటర్లుండగా పురుషులకన్నా 80,875 మంది మహిళా ఓటర్లు ఎక్కువ ఉన్నట్టు లెక్క తేలింది. మహిళల తర్వాత యువ ఓటర్లే కీలకం కానున్నారు. కొత్తగా ఓటు హక్కు పొందినవారు 26 వేల వరకు ఉన్నారు. మొత్తం ఓటర్లలో యువతీయువకులే దాదాపు సగం వరకు ఉన్నారు. కొత్త జాబితా ప్రకారం 18 నుంచి 39 ఏండ్ల మధ్య వయస్సున్న ఓటర్ల సంఖ్య 6, 96,014. దీంతో రానున్న లోకల్? బాడీ ఎన్నికల్లో మహిళలు, యువతే కీలకం కానున్నారు. దీంతో యువతలో కూడా సర్పంచ్ పదవులపై ఆశ కనిపిస్తోంది. పంచాయితీలతో పాటు వాటి పరిధిలోని 5,022 వార్డులకు ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు ఇప్పటికే ఏర్పాట్లు చేశారు. బ్యాలెట్ బాక్స్ లతో పాటు పేపర్ బ్యాలెట్ రెడీ చేశారు. జిల్లాలో 31 మండలాలున్నాయి. పంచాయతీ ఎన్నికల తర్వాత ఈ మండలాల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికలన్నింటిలోనూ యువత, మహిళలే నిర్ణేతలు కానున్నారు. వారు ఎవరివైపు మొగ్గు చూపితే వాళ్లే అందలమెక్కే చాన్స్‌ఉందని అంటున్నారు.

## పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌కు 14 ఏళ్ల జైలు శిక్ష

(మొదటి తరువాయి)

తుదితీర్పు చదివి వినిపించారు. ఇమ్రాన్, బుష్రాలకు 10 లక్షలు, 5 లక్షల పాకిస్థానీ రూపాయల జరిమానా విధించారు. ఇమ్రాన్ దంపతులతో పాటు మరో ఆరుగురిపైనా నేషనల్ అకౌంటబులిటీ బ్యూరో 2023లో ఈ కేసు నమోదు చేసింది. లండన్‌లో ఉంటున్న పాక్ స్థిరాస్తి వ్యాపారి మాలిక్ రియాజ్ హుసేన్ నుంచి వసూలుచేసిన 19 కోట్ల పౌండ్లను బ్రిటన్ పాక్‌కు పంపగా.. ఆ సొమ్మును ఇమ్రాన్ దంపతులు గోల్‌మాల్ చేశారని ఆరోపణ. దీన్ని అల్‌ఖాదిర్ ట్రస్టు కేసుగా వ్యవహరిస్తున్నారు. ఇమ్రాన్ ప్రధానిగా ఉన్నప్పుడు బ్రిటన్ నుంచి అందిన ఆ 19 కోట్ల పౌండ్లను జాతీయ ఖజానాలో జమ చేయకుండా, సుప్రీంకోర్టు గతంలో రియాజ్‌హుసేన్‌కు విధించిన జరిమానాలో కొంత మొత్తాన్ని ఆ నగదులో నుంచి కట్టడానికి అనుమతించారని అభియోగం. దీనికి బదులుగా ఇమ్రాన్ దంపతుల ట్రస్టు నెలకొల్పదలచిన అల్‌ఖాదిర్ విశ్వవిద్యాలయానికి హుసేన్ 57 ఎకరాలను బహుమానంగా ఇచ్చినట్లు చెబుతున్నారు. ఆగస్టు 2023 నుంచి ఇమ్రాన్ ఖాన్ జైలు జీవితం గడుపుతున్నారు. ఆయనపై సుమారు 200కు పైగా కేసులు నమోదయ్యాయి. అవన్నీ రాజకీయ ప్రేరేపితమైనవేనని, తనను అధికారానికి దూరంగా ఉంచేందుకు చేస్తోన్న కుట్ర అని మాజీ ప్రధాని తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. ఇటీవల తనపై ఉన్న జైలు శిక్ష సస్పెండ్ కావడంతో బుష్రాబీబీ ప్రస్తుతం బయటే ఉన్నారు. అయితే తాజా తీర్పు సందర్భంగా ఆమె కోర్టుకు వచ్చినట్లు తెలుస్తోంది.

## అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు

(మొదటి తరువాయి)

ఉన్నవారికి ,రెండవ విడతలో ఇంటి స్థలంతో పాటు ఇందిరమ్మ ఇల్లును నిర్మించి ఇస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు, గ్రామాలలో రెవెన్యూ వ్యవస్థ, సర్వేయర్ల నియామకంపై డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలోని తన కార్యాలయంలో శుక్రవారంనాడు చీఫ్ సెక్రటరీ శాంతికుమారితో కలిసి సమీక్షించారు. ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ , హౌసింగ్ సెక్రటరీ జ్యోతి బుద్ధ ప్రకాష్, హౌసింగ్ కార్పోరేషన్ ఎండీ వి.పి. గౌతమ్,జిహెచ్ ఎం సీ కమిషనర్ ఇలంబర్తి, సిఎంఆర్‌వో డైరెక్టర్ మకరంద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి అవసరమైన ఇంజనీరింగ్ విభాగాన్ని సమకూర్చుకోవడం, ప్రతి రెవెన్యూ గ్రామానికి రెవెన్యూ అధికారి నియామకం, సర్వేయర్ల నియామకంపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లకు అర్హులైన లబ్ధిదారులకు సంబంధించిన నివాస స్థలం ఉన్నవారి జాబితా, నివాస స్థలం లేని వారి జాబితా రెండు జాబితాలను గ్రామసభల్లో పెట్టాలని అధికారులకు సూచించారు. దశల వారీగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని చేపడుతున్నామని తెలిపారు. ప్రస్తుతం హౌసింగ్ కార్పొరేషన్‌లో 274 మంది ఇంజనీర్లు మాత్రమే ఉన్నారని రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పర్యవేక్షణకు మరో 400 మంది ఇంజనీర్లు అవసరమని ఈ సందర్భంగా అధికారులు మంత్రిగారి దృష్టికి తీసుకువచ్చారు.

## ఆరు గ్యారెంటీలని.. అర గ్యారెంటీ అమలు

(మొదటి తరువాయి)

100 రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామన్నారు. ఈ రాష్ట్రంలో ఉన్న 1.67 కోట్ల మంది ఆడబిడ్డలకు ఒక్కొక్కరికి నెలకు రూ.2,500 చొప్పున రూ.30వేలు సీఎం రేవంత్‌రెడ్డి బాకీ ఉన్నారు. ఒక్కో రైతుకు ఎకరానికి రూ.17,500 బాకీ పడ్డారు. రైతులందరికీ రుణమాఫీ చేశామని నిరూపిస్తే రాజీనామా చేస్తా. గతంలో రైతుబంధుకు అడ్డుగా పిటిషన్ వేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్లు అడిగేందుకు వచ్చిన కాంగ్రెస్ నేతలను ఎక్కడికక్కడ మహిళలు, రైతులు నిలదీయాలని ఈ సందర్భంగా కెటిఆర్ పిలుపునిచ్చారు. రాష్ట్రంలో రుణమాఫీ వంద శాతం పూర్తయిందని నిరూపిస్తే.. నేను, మా ఎమ్మెల్యేలంతా రాజీనామా చేస్తాం' అంటూ సవాల్ విసిరారు. ఆరు గ్యారెంటీలు ఇచ్చి.. అర గ్యారెంటీ మాత్రమే అమలు చేస్తున్నారన్నారు. కేవలం ఫ్రీ బస్సుతో సరిపెట్టారని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ నేతలను రైతులు నిలదీయాలన్నారు. రైతు భరోసా రూ.15 వేలు ఇస్తామని చెప్పి.. మోసం చేశారని మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రతి మహిళకు రేవంత్ రూ.30 వేలు బాకీ పడ్డారని.. రూ.30 వేలు ఇస్తేనే ఓటేస్తామని మహిళలు నిలదీయాలని మాజీ మంత్రి అన్నారు. ఎన్నికలప్పుడు రూ.7600 కోట్లు రైతుబంధు వేసేందుకు తాము సిద్ధమైతే ఈసీకి లేఖ రాసి రైతు బంధును వేయనీయకుండా అడ్డుకున్నారన్నారు. యాసంగి పంట సమయంలో రైతుల కోసం రూ.7600 కోట్లు పెడితే.. రేవంత్ ప్రభుత్వం వచ్చాక నాట్లు వేసే సమయంలో కాకుండా.. పార్లమెంటు ఎన్నికల సమయంలో ఓట్ల కోసం రైతుల ఖాతాలో వేశారని విమర్శించారు. ఒక్కసారి మాత్రమే కేసీఆర్ ఇచ్చిన డబ్బులను రైతు భరోసా కింద వేశారని.. ఆ తరువాత రైతు భరోసా ముచ్చటే లేదన్నారు. ఖచ్చితంగా జనవరి 26న రైతులకు ఇస్తానన్న రైతు భరోసాను ఇవ్వాల్సిందే అని స్పష్టం చేశారు. అది కూడా రూ.12 వేలు కాదు.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రూ.15 వేలను రైతుల ఖాతాలో జమ చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. వానాకాలం పంటకు ఎగ్గొట్టిన రైతు బంధును కూడా రైతులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతలు ఓటేయమని అడిగితే.. ముందు బాకీ తీర్చాకే ఓటు వేస్తామని గట్టిగా చెప్పాలని రైతులకు చెప్పారు. రైతులకు ఎకరానికి రూ.17500 బాకీ ఉంటే.. మహిళలకు సంవత్సరానికి రూ.30 వేల మేర రేవంత్ రెడ్డి బాకీ ఉన్నారని తెలిపారు. రేవంత్ రెడ్డి పచ్చి మోసగాడు అంటూ కేటీఆర్ తీవ్ర స్థాయిలో వ్యాఖ్యలు చేశారు. 37 రోజులు కాదు దమ్ముంటే 370 రోజులు జైల్లో పెట్టుకో.. భయపడేటోడు ఎవడూ లేడు అని సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ తేల్చిచెప్పారు. కానీ ఇచ్చిన ప్రతి హామీ నిలబెట్టుకో. నిలబెట్టుకోకపోతే వెంటాడుతాం.. అడుగూతనే ఉంటాం. పేదల తరపున కొట్లాడుతూనే ఉంటాం అని కేటీఆర్ స్పష్టం చేశారు. సర్పంచ్, జడ్పీటీసీ ఎన్నికల్లో కాంగ్రెసోళ్లు వస్తారు.. చేయి గుర్తుకు ఓటేయండి అని అడుగుతారు. మీ సీఎం రైతుభరోసా కింద ఎకరానికి 17500 చొప్పున బాకీ ఉన్నాడు.. ఆ డబ్బులు చెల్లిస్తే ఓట్లు వేస్తామని చెప్పండి. బాకీ ఉన్నోన్ని అడిగినట్టు గల్లా పట్టుకుని అడగాలి.. అభయ హస్తం భస్మాసుర హస్తం అయిపోందని నిలదీయాలని ఆడబిడ్డలకు, రైతులకు కేటీఆర్ పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని మహిళలకు చిలుకకు చెప్పినట్టు చెప్పిండు కేసీఆర్. కాంగ్రెసోళ్లను నమ్మకండి అని చెప్పిండు. నెలకు 2500 పడ్డాయా..? 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు అయ్యాయా.? సర్పంచ్ ఎన్నికలప్పుడు వేస్తడు.. మళ్లీ నాలుగేండ్ల వరకు కనిపించడు. కాబట్టి రైతుబీమా, రైతు రుణమాఫీ, రైతు భరోసా ఎక్కడ అని నిలదీయండని రైతులకు, ఆడబిడ్డలకు కేటీఆర్ సూచించారు.

## జీవ ఇంధనాల అభివృద్ధిపై భారతదేశం దృష్టి

(మొదటి తరువాయి)

దృష్టిసారిస్తోందన్నారు. దిగ్గజ వ్యాపారవేత్తలు రతన్ టాటా, ఒసాము సుజుకీ భారతదేశ ఆటో రంగం వృద్ధికి.. మధ్యతరగతి ప్రజల కలను నెరవేర్చడానికి ఎంతో సహకారం అందించారని అన్నారు. భారత్ పెట్టుబడులకు స్వర్గధామమని.. మొబిలిటీ రంగంలో తమ భవిష్యత్తును రూపొందించుకోవాలని చూస్తున్న ప్రతీ పెట్టుబడిదారుడికి భారతదేశం అత్యుత్తమ గమ్యస్థానంగా నిలుస్తుందని అన్నారు. 'భారత్ మొబిలిటీ ఎక్స్ పో 2025'ను ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. పెరుగుతున్న మధ్యతరగతి, వేగవంతమైన పట్టణీకరణ, సరసమైన వాహనాలు భారతదేశంలో ఆటో రంగాన్ని ముందుకు తీసుకువెళు తున్నాయని ప్రధాని పేర్కొన్నారు. దాదాపు 25 కోట్ల మంది ప్రజలు పేదరికం నుంచి బయటపడ్డారని, వీరు వాహనాలను కొనుగోలు చేయాలనుకుంటున్నారని ప్రధాని మోదీ చెప్పారు. ఈవీలను ప్రోత్సహించడానికి పలు ప్రాంతాల్లో ఛార్జింగ్ పాయింట్లను ఏర్పాటుచేశామన్నారు.మేక్ ఇన్ ఇండియా కార్యక్రమం దేశంలో ఆటో పరిశ్రమ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిందన్నారు. ఈ దశాబ్దం చివరికి ఎలక్ట్రిక్ వాహనాల(ఇ÷ఎ)అమ్మకాలు ఎనిమిది రెట్లు పెరుగుతాయని అన్నారు. 5 ఏళ్ల క్రితం ప్రారంభించిన ఫ్రేమ్-2 పథకం కింద రూ.8000 కోట్లకు పైగా సబ్సిడీగా ఇచ్చామని ప్రధాని పేర్కొన్నారు. దీంతో 16 లక్షలకు పైగా ఎలక్ట్రిక్ బస్సులు ఏర్పాటుచేశామన్నారు. ఢిల్లీలోనే 1200 కంటే ఎక్కువ ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తున్నాయని తెలిపారు. ఒకప్పుడు భారతదేశంలో నాణ్యమైన రోడ్లు లేకపోవడంతో ప్రజలు కార్లు కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపకపోయేవారని ప్రధాని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆ పరిస్థితి మారుతుండటంతో కార్లకు డిమాండ్ పెరుగుతోందన్నారు. ఏడాదికి దాదాపు 2.5 కోట్ల కార్లు విక్రయమవుతున్నాయని తెలిపారు. దేశ రాజధానిలోని భారత మండపంలో నేడు ప్రారంభమైన 'భారత్ మొబిలిటీ ఎక్స్ పో.. 22వ తేదీ వరకు జరగనుంది. యశోభూమి, గ్రేటర్ నోయిడాలోని ఇండియా ఎక్స్‌పో సెంటర్/మార్ట్ వేదికల్లో ఎక్స్‌పో కొనసాగనున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు.

## పాత రేషన్ కార్డులు తొలగించడం లేదు

(మొదటి తరువాయి)

లక్షల రేషన్ కార్డులు ఉన్నాయని, పాత రేషన్ కార్డులు తొలగించడం లేదని స్పష్టం చేశారు. అర్హత ఉండి కొత్త రేషన్ కార్డులు రాని వారికి జనవరి 26 నుండి కొత్త కార్డులు ప్రభుత్వం ఇస్తుందని, ప్రతిపక్షాలు కావాలని రాజకీయం చేసి రాద్ధాంతం చేస్తున్నాయని మండిపడ్డారు. రేషన్ కార్డు అర్హత ఉండి రాకుంటే.. సంబంధిత అధికారికి, ప్రజాప్రతినిధులకు విజ్ఞాపన పత్రాలు ఇవ్వచ్చుని మంత్రి పొన్నం చెప్పారు. కరీంనగర్ జిల్లా చిగురు మామిడి మండలం ఇందుర్తి మండలంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ? 'జనవరి 26 నుండి కొత్త రేషన్ కార్డులు ఇచ్చే పక్రియ కోసం గ్రామాల్లో సర్వే జరుగుతుంది. తెలంగాణ ప్రజలకు కొన్ని అంశాలు చెప్పే ప్రయత్నం చేస్తున్నా. 2 కోట్ల 81 లక్షల మందికి ఇప్పటికే తెలంగాణలో 90 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయి. ఇప్పుడు పాత 90 లక్షల రేషన్ కార్డులు చర్చ కాదు. గత 10 సంవత్సరాలుగా రేషన్ కార్డులు లేకుండా, కొత్తగా పెళ్లి అయిన వారికి, కొత్త కుటుంబాలు, మార్పులు చేర్పులు, అర్హత ఉండి కొత్త రేషన్ కార్డులు రాని వారికి శుభవార్త చెబుతున్నా. అర్హత ఉన్న వారికి జనవరి 26 నుండి రేషన్ కార్డులు ఈ ప్రభుత్వం ఇస్తుంది. ప్రతిపక్షాలు కావాలని రాజకీయం చేసి రాద్ధాంతం చేస్తున్నాయి. రేషన్ కార్డు అర్హత ఉండి రాకుంటే సంబంధిత అధికారి, ప్రజా ప్రతినిధులకు విజ్ఞాపన పత్రాలు ఇవ్వవచ్చుని తెలిపారు. 'పాత రేషన్ కార్డులు తొలగించడం లేదు. ఇందులో ఎలాంటి అనుమానం లేదు. ఎవరైనా తప్పుడు ప్రచారం చేస్తే నమ్మవద్దు. కుల సర్వే ఆధారంగా అప్లికేషన్ల సమాచారంతో కొత్త రేషన్ కార్డులు వస్తున్నాయి. ఇందుర్తిలో 71 కొత్త రేషన్ కార్డులు వచ్చాయి. అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు వస్తున్నాయి.

## మా మేనిఫెస్టోను కాపీ కొట్టారు

(మొదటి తరువాయి)

ఎందుకు ఎన్నుకోవాలని ఆయన ప్రశ్నించారు. బీజేపీ 'సంకల్ప పాత్ర'ను ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా శుక్రవారం విడుదల చేశారు. మహిళలకు ప్రతినెలా రూ.2,500 ఆర్థిక సాయం, గ్యాస్ సిలెండర్లపై రూ.500 సబ్సిడీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించారు. ఢిల్లీలో ఆప్ సర్కార్ అమలు చేస్తున్న పథకాలన్నింటినీ కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. దీనిపై కేజ్రీవాల్ నిశిత విమర్శలు చేశారు. 'కేజ్రీవాల్ తరహాలోనే ఉచితాలు ఇస్తామంటూ బీజేపీ జాతీయ అధ్యక్షుడు ఈరోజు ప్రకటించారు. నేను ఒకటే అడుగుతున్నాను. ఉచితాలు మంచివి కావని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇంతవరకూ చెబుతూ వచ్చారు. ఇప్పుడు ఉచిత హామీలు గుప్పించడం ద్వారా గతంలో తాము చెప్పినది తప్పని, కేజ్రీవాల్ చేసింది సరైనదేనని ఒప్పుకున్నట్టు అయింది. ఉచితాలు హానికరం కాదని, దేశానికి భగవంతుని ప్రసాదమని మోదీ చెప్పాలి' అని కేజ్రీవాల్ డిమాండ్ చేశారు. కేజ్రీవాల్ పథకాలన్నింటినీ కొనసాగిస్తామని నడ్డా ఇప్పుడు చెబుతున్నారని, ఆ విషయాన్ని సంకల్ప్ పాత్రలోనూ చేర్చారని అన్నారు. ఢిల్లీలోని మొహల్లా క్లినిక్‌లను మూసేస్తామని నడ్డా చెబుతుండటంపై తాను ఈరోజు ఢిల్లీ ప్రజల వద్దకు వెళ్లి, మొహల్లా క్లినిక్‌కు కావాలా, వద్దా అని అడిగానని చెప్పారు. మొహల్లా క్లినిక్‌లకు అనుకూలంగా ఉన్న వారు ఆప్‌కు ఓటు వేయాలని, వద్దనుకునే వారు బీజేపీకి ఓటు వేయాలని అన్నారు. నా పని మరింత మెరుగ్గా ఎలా చేయాలో నాకు బాగా తెలుసు. కేజ్రీవాల్ చేసే పనే మీరు చేస్తే మిమ్మల్ని ఎందుకు ఎన్నుకోవాలని ప్రజలు బీజేపీని అడుగుతున్నారు' అని ఆయన చెప్పారు. బీజేపీ మేనిఫెస్టో క్లుప్తంగా చెప్పాలంటే, కేజ్రీవాల్ చేసిన పనిని బీజేపీ అభినందించిందని చెప్పారు.

## 31నుంచి బడ్జెట్ సమావేశాలు

(మొదటి తరువాయి)

ఏప్రిల్ 4 వరకు రెండో విడత సమావేశాలు జరగనున్నాయి. ఈ నెల 31న పార్లమెంట్‌లో రాష్ట్రపతి ప్రసంగంతో సమావేశాలు ప్రారంభం కానున్నాయి. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను ఫిబ్రవరి 1న కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్నారు.

## సంపాదకీయం

# చరిత్రలోకి జారిపోతున్న 'ఇండియా'!

ప్రధాని మోదీ నేతృత్వంలోని భారతీయ జనతా పార్టీకి వ్యతిరేకంగా ఒక మహాకూటమి ఏర్పాటు చేయాలన్న ఆలోచన యుక్తమైనదే, అయితే అదెంతవరకు సుసాధ్యమవుతుందో నేను కచ్చితంగా చెప్పలేను'%–% జూన్ 2023లో ఇండియా కూటమి సీనియర్ నాయకుడు ఒకరు అన్న మాట అది. ఆ రాజకీయ దురంధరుడు చాలా జాగ్రత్తగా చెప్పిన ఆ మాటలు ఇప్పుడు దాదాపుగా రుజువయ్యాయి. పద్దెనిమిది నెలల క్రితం రోహిణీ కార్తె రోజుల్లో పాట్నాలో విభిన్న రాజకీయ స్వభావాలతో వ్యవహరించే వివిధ రాజకీయ పక్షాలు అసంభవమనుకున్న బీజేపీ వ్యతిరేక రాజకీయ కూటమి నేర్పాటు చేశాయి. సార్వత్రక ఎన్నికల అనంతరం ఆ కూటమి చీలిపోవడం ప్రాంభమయింది. ఆ చీలిక ప్రక్రియ ఇప్పుడు దాదాపుగా పూర్తయిందని చెప్పవచ్చు. ఇండియా కూటమి దాదాపుగా అస్తమించింది. దానికి అంత్యక్రియలు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన పిమ్మట తప్పక జరుగుతాయి. గత సార్వత్రక ఎన్నికలలో మోదీ నేతృత్వంలో బీజేపీ 400 లోక్‌సభ సీట్లను సాధించాలని మోదీ నేతృత్వంలోని బీజేపీ నిర్దేశించుకున్న లక్ష్యాన్ని అడ్డుకునేందుకు ప్రభవించిన ఇండియా కూటమి లక్ష్య పరిపూర్తి అనంతరం ఎంతో కాలం సమైక్యంగా ఉండలేక పోయింది. తగ్గిన మెజారిటీతో నరేంద్ర మోదీ మళ్లీ ప్రధానమంత్రి అయ్యారు. ఆ తరువాత జాతీయ ప్రాథమ్యాల కంటే రాష్ట్ర స్థాయి రాజకీయ అవసరాలు, ఒత్తిళ్లే ఇండియా కూటమి రాజకీయాలను ప్రభావితం చేయడం ప్రారంభమయింది. బెంగాల్‌లో మమతా బెనర్జీ, వామపక్షాలు సమైక్యంగా పనిచేసేందుకు ఆమోదయోగ్యమైన ప్రాతిపదిక ఏమైనా ఉన్నదా? పోనీ, అటువంటి ప్రాతిపదికను కనుగొనేందుకు మమత, వామక్షాలు ప్రయత్నించగలవని ఎవరూ భావించలేరు. బిహార్‌లో శత్రువులుగా మారిన స్నేహితులు, తిరిగి స్నేహపూరిత శత్రువులుగా మారిన నితీశ్ కుమార్, లాలూప్రసాద్ యాదవ్‌ల మధ్య ఎప్పుడైనా పరస్పర విశ్వాసమున్నదా? కశ్మీర్ లోయలో ఆధిపత్యానికి తీవ్రంగా పోటీపడే ఒమర్ అబ్దుల్లా, మెహబూబా ముఫ్తి ఇంకా ఎంతకాలం ఒకే కూటమి(ఇండియా)లో ఉండగలుగుతారు? మహా రాష్ట్రలో శివసేన (ఉద్ధవ్) తన మిలిటెంట్ హిందుత్వ గతాన్ని తన ఇప్పటి అస్పష్ట వర్తమానంతో ఇంకెంత కాలం సామరస్యంగా ఉంచగలుగుతుంది? జాతీయ ఎన్నికలలో నరేంద్ర మోదీ, బీజేపీ ఉమ్మడి శత్రువులే అయినప్పటికీ రాష్ట్ర స్థాయిలో సమీకరణాలు తప్పక మారతాయి. మారాయి కూడా. ఢిల్లీలోనే ఈ వాస్తవం తేటతెల్లంగా కనిపిస్తోంది. ఎనిమిది నెలల క్రితం దేశ రాజధానిలో కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలుగా కలిసికట్టుగా పోరాడాయి. అదే సమయంలో పంజాబ్‌లో ప్రత్యర్థులుగా ఎన్నికల బరిలో నిలిచాయి. ఒకే కూటమిలో ఉన్నా ఇరు పార్టీల మధ్య సఖ్యత లోపించింది. రాజకీయ అంకగణితం నుంచి లబ్ధి పొందడానికి ఎంతగా ప్రయత్నించినా కాంగ్రెస్, ఆప్‌ల మధ్య దృఢ అనుబంధం లేనేలేదు. ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ రాజకీయ శిథిలాల నుంచే రాజకీయ అంకుర పక్షమైన ఆప్ ప్రభవించిందనే సత్యం విస్మరించరానిది 2011లో అవినీతికి వ్యతిరేకంగా అరవింద్ కేజ్రీవాల్ నిర్వహించిన ఉద్యమమే మన్మోహన్ సింగ్ ప్రభుత్వాన్ని బలహీనపరిచింది. ఢిల్లీలోనే కాకుండా దేశవ్యాప్తంగా ప్రభుత్వ వ్యతిరేక వాతావరణాన్ని సృష్టించింది. ఈ పరిస్థితిని 2014 సార్వత్రక ఎన్నికలలో తన ప్రయోజనాలకు బీజేపీ పూర్తిగా వినియోగించుకున్నది. ఢిల్లీకి వరుసగా 15 సంవత్సరాల పాటు ముఖ్యమంత్రిగా ఉన్న కాంగ్రెస్ నాయకురాలు షీలా దీక్షిత్‌ను మట్టి కరిపించారు. అయితే అంతిమంగా కాంగ్రెస్ బయట నుంచి ఇచ్చిన మద్దతుతో ఢిల్లీలో ప్రభుత్వాన్ని కేజ్రీవాల్ ఏర్పాటు చేశారు. దేశ పురాతన రాజకీయ పక్షానికి కొత్తగా రాజకీయాలలోకి వచ్చిన కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆప్‌కు మద్దతునివ్వడం తప్పనిసరి అయింది. దరిమిలా దేశ రాజధానిలో కాంగ్రెస్ వైభవం క్షీణించి పోయింది. ఒక దశాబ్ద కాలంగా ఢిల్లీ నుంచి లోక్‌సభకు గెలిచిన కాంగ్రెస్ నేత ఎవరూ లేరు. కనుకనే ప్రస్తుత ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలలో ఒంటరిగా పోటీ చేయడం ద్వారా తన మనుగడను కాపాడుకునేందుకు, తన సత్తాను నిరూపించుకునేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. గత సార్వత్రక ఎన్నికలలో వలే కలిసికట్టుగా పోటీ చేసేందుకు అటు ఆప్ గానీ, ఇటు కాంగ్రెస్ గానీ ప్రయత్నించనే లేదు. పైగా ఇరు పార్టీలు పరస్పరం తీవ్ర విమర్శలు చేసుకుంటున్నాయి. వాటి మధ్య మాటల యుద్ధం అదుపు తప్పుతోంది. ఈ పరిస్థితి బీజేపీకి తన గెలుపుపై భరోసానిస్తోంది. గత ఏడాది హర్యానా అసెంబ్లీ ఎన్నికలలో ఆప్‌తో పొత్తు పెట్టుకునేందుకు రాహుల్ గాంధీ అంగీకరించారు. అయితే తమ విజయంపై మితిమీరిన విశ్వాసంతో హర్యానా పీసీసీ నాయకులు ఆప్‌తో పొత్తుకు అంగీకరించలేదు. పొత్తు ప్రయత్నాలను విఫలం చేసేందుకు చేయవలసినదంతా చేశారు. హర్యానా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో ఓడిపోయిన కాంగ్రెస్, ఇప్పుడు ఢిల్లీ ఎన్నికలలో ఒంటరిగా పోటీ చేయవలసిన అగత్యంలోకి పడిపోయింది. ఇప్పుడు కేజ్రీవాల్ కాంగ్రెస్‌తో పొత్తుకు ససేమిరా అన్నారు. అంతేకాకుండా ఇండియా కూటమి నుంచి కాంగ్రెస్‌ను గెంటివేయాలని కూడా ఘోషించారు! ఇండియా కూటమి ఆవిర్భావం నుంచి దాని ప్రస్థానాన్ని సింహావలోకనం చేస్తే నాయకుల అహమికలు, ఆకాంక్షలు ఎంత పరస్పర విరుద్ధంగా ఉన్నాయో ఆశ్చర్యం గొలుపుతుంది. ఆ మాటకొస్తే ఆ నాయకులు అసలు ఆ మహా కూటమి నిర్మాణానికి ఎలా పూనుకున్నారా అని అంతులేని విస్మయమూ కలుగుతుంది. మోదీ వ్యతిరేక ప్రతిపక్ష కూటమిని తొట్ట తొలుత ప్రతిపాదించిన నితీశ్ కుమార్ 'ఇండియా' నుంచి వైదొలిగిన మొట్టమొదటి నేత కావడం గమనార్హం. ఇండియా కూటమికి కన్వీనర్‌గా ఉండాలన్నది ఆయన ప్రగాఢ ఆకాంక్ష. అయితే ఇతర భాగస్వామ్య పక్షాలు అందుకు ససేమిరా అనడంతో నితీశ్ ముందుగానే ఇండియా కూటమి నుంచి నిష్క్రమించి తన కొక భద్ర బాటను ఎంచుకున్నారు. బెంగాల్‌లో వామపక్షాలతో కాంగ్రెస్ పొత్తు పెట్టుకోవడాన్ని మమతా బెనర్జీ క్షమించరుగాక క్షమించరు. పైగా అన్ని విధాల తనకు జూనియర్ అయిన రాహుల్ గాంధీ కంటే తాను తక్కువ స్థానంలో ఉండవలసిరావడాన్ని ఆమె అంగీకరించలేక పోయారు. కాంగ్రెస్ ఆధిపత్యాన్ని ఆమె ప్రశ్నించారు, వ్యతిరేకించారు. ఇక కాంగ్రెస్ నాయకత్వంలో ఒక బలమైన వర్గం లోక్‌సభలో తమకు 99 స్థానాలు దక్కడాన్ని ఒక మహా విజయంగా పరిగణించింది. తమ పార్టీ పునరుజ్జీవితమవుతున్నదని విశ్వసించింది. క్షేత్ర స్థాయి వాస్తవాలను విస్మరించింది.

# రూపాయిని నిలబెట్టే ప్రయత్నాలేవీ ?



ఆర్థిక మందగమనం, ద్రవ్యోల్బణం, రూపాయి పతనం ఇప్పుడు దేశాన్ని కుదిపేస్తున్నాయి. వీటి ప్రభావం ధరలపై పడుతోంది. తద్వారా సామాన్యుడు విలవిల్లాడుతున్నాడు. మరో పదిరోజుల్లో బడ్జెట్ ప్రవేశ పెట్టేందుకు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మరోమారు సిద్ధమవుతున్న వేళ..ఈ దిద్దుబాటు చర్యలు ఉంటాయా అన్నది అనుమానంగానే ఉంది. ఎవరిదారి వారిది అన్న చందంగా ప్రభుత్వం నడుస్తోంది. ధరలు అదుపులోకి రావడం లేదు. నిరుద్యోగం తీరడం లేదు. రూపాయి విలువను కాపాడే ప్రయత్నాలు జరగడం లేదు. కానీ బడ్జెట్‌లో దిగుమతి సుంకాలు పెంచే ప్రయత్నం చేస్తామని అంటున్నారు. ఇలా చేయడం వల్ల రూపాయి విలువ పెరుగుతుందనుకుంటే పొరపాటు. నేలవిడిచి సాము చేస్తున్న చందంగా కేంద్రం చర్యలు ఉంటున్నాయి. నిజానికి చైనాను చూసి మనం ఎంతో నేర్చుకోవాల్సి ఉంది. అధిక జనాభాను ఉపయోగిం చుకుని వస్తూత్పత్తిన పెంచుకుని ప్రపంచ మార్కెట్ పెంచుకునే ప్రయత్నాలు చేయడం లేదు. అలాగే గత పదేళ్లుగా మోడీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు ఏనాడూ రూపాయిని నిలబెట్టే ప్రయత్నాలు చేయలేదు. అందుకే డాలర్ ముందు రూపాయి తేలిపోతోంది. రోజురోజుకూ విలువ కోల్పోతూ తన రికార్డును తానే బద్దలుకొడుతోంది. ఇటీవల రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే..రూ. 87కు చేరువలో ఉంది. సమీపకాలంలో రూపాయి విలువ మరింత పతనం కావచ్చునని ఆర్థికవేత్తలు అంచనావేస్తున్నారు. అయినా ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ మాత్రం కొత్తంగా ఏయే పన్నులు వేయవచ్చో..వేటిని జిఎస్టీ కిందకు తీసుకుని రావవచ్చో అన్న ఆలోచనలో ఉన్నట్లుగా ఉంది. 2014లో ఎన్నికల ప్రచారంలో నరేంద్ర మోదీ రూపాయి పతనం గురించి చేసిన వ్యాఖ్యలు అందరూ గుర్తుకు తెచ్చుకోవాల్సిన తరుణమిది. దేశ రక్షణ గురించి గానీ,రూపాయి పతనం గురించి గానీ మన్మోహన్‌సింగ్ ప్రభుత్వానికి పట్టింపు లేదని మోదీ అప్పట్లో ఘాటైన వ్యాఖ్యలు చేశారు. ఆయనతో పాటు, ఆయన ప్రధాని కావాలని కోరుకున్న ప్రముఖులంతా రూపాయి పతనం మీద చేసిన వ్యాఖ్యలు అప్పుడే మరచిపోలేం.ఎందుకంటే రూపాయి పతనం అప్పటి కన్నా వేగంగా పతనం అవుతోంది. అప్పట్లో రూపాయి గురించి గుండెలుబాదుకున్న వారంతా ఇప్పుడు ఎందుకో నోరువిప్పడం లేదు. ఇప్పుడు రూపాయి పతనం ఎంతగా పడిపోతున్నా ఎందుకనో మన మైనముని మోడీ మాత్రం నోరు విప్పడం లేదు. మన్మోహన్ సింగ్‌ను మౌనముని అంటూ దెప్పి పొడిచిన మోడీ ఇప్పుడు తాన అతిపెద్ద మౌనమునిగా మారారు. రూపాయి విలువ దారుణంగా పడిపోవడంతో ఆర్థిక నిపుణుల్లో ఆందోళన నెలకొంది. రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా దిద్దుబాటు చర్యలేవీ ఫలితాలు ఇవ్వడం లేదు. సెప్టెంబర్ నెల నుండి రూపాయి పతనం స్పష్టంగానే కనిపిస్తోంది. సెప్టెంబర్ 12న డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ రూ. 83.98కి పడిపోయింది. అప్పట్లో అదో రికార్డు. ఆ స్థాయికి రూపాయి విలువ పడి పోవడం అదే మొదటిసారి కావడంతో కలకలం రేగింది. మార్కెట్లో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. మోదీ ప్రభుత్వానికి ఈ విషయమే పట్టని.. ఫలితంగా పతనంలో రూపాయి కొత్త రికార్డులు సృష్టించడం ప్రారంభమైంది. రూపాయి విలువ తగ్గిపోతోంది కాబట్టి మన జేబులో డబ్బు ఎక్కువగా ఖర్చు చెయ్యాల్సి వస్తోంది. అందువల్ల దిగుమతులపై సుంకాలు విధిస్తే సరిపోతుందన్న భావనలో మోడీ ప్రభుత్వం ఉంది. ఇదొక్కటే సరిపోదు. మనదేశ ఎగుమతులు పెరగాలి. మన మార్కెట్ పెరగాలి. మన వస్తువులు ప్రపంచాన్ని తాకాలి. అప్పుడే రూపాయికి బలం చేకూరుతుంది. మేకిన్ ఇండియా నినాదంగా మారడంతో వస్తూత్పత్తి పడిపోయింది. కార్మికులు పనులు లేకుండా పస్తులు ఉంటున్నారు. అందుకే గత పదేళ్ళలో డాలర్‌తో రూపాయి మారకపు విలువ 25 శాతం పతనమైంది. అప్పట్లో నెలకు రూ. 10వేలు సంపాదించేవారు సంసరాన్ని ఈడ్చుకుని వచ్చేవారు. కానీ ఇప్పుడున్న పరిస్థితుల్లో నెలకు దాదాపు రూ. 50వేల దాకా సంపాదించాలి. ఆ స్థాయిలో సామాన్యుల వేతనాలు పెరుగుతున్నాయా అంటే లేదు. కాబట్టి రూపాయి పతనం వల్ల నష్టపోతున్నది పేదలు, మధ్య తరగతివారు, సామాన్యులే. పదేళ్ల కిందట ఒక డాలర్ కోసం మనం 63 రూపాయలు చెల్లించాల్సి వచ్చేది. మరి ఇప్పుడు 87 రూపాయలు చెల్లించాల్సి వస్తోంది. ఇదివరకు కూరగాయలు కొంటే 100 రూపాయలకి సంచినిండేది, ఇప్పుడు 500 రూపాయలు పెట్టినా నిండట్లేదు. ఒక్క కూరగాయలే కాదు, ఇంట్లో వాడే ప్రతీ నిత్యావసరం ధరా పెరుగుతూనే ఉంటుంది. ఇప్పుడు నిత్యావసర వస్తువుల ధరలు కూడా దారుణంగా పెరిగాయి. పప్పుల ధరలు 250కి కిలోగా ఉన్నాయి. ధరలు మరింత పెరగడం ఖాయం. రూపాయి పతనం వల్ల పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు బాగా పెరుగుతాయి. మనం విదేశాల నుంచి చమురును ఎక్కువగా కొంటున్నాం, భారీగా చెల్లింపులు జరుపు తున్నాం కనుక విలువ ప్రభావం ఇక్కడ అధికంగా ఉంటుంది. కోడిగుడ్డు ఒక రూపాయి నుంచి గత సంవత్సరం 5 రూపాయలు అయ్యింది. ఈ సంవత్సరం 7 రూపాయలు అయ్యింది.

# మనిషిని యంత్రుడుగా మారుస్తారా?




జనవరి తొమ్మిదిన రెండు వార్తలు ఉద్యోగ–, శ్రామిక రంగాల్లో పెద్ద దుమారాన్ని రేపాయి. మొదటిది, కృత్రిమ మేధ (ఏఐ) తదితర ఆధునిక సాంకేతిక ఆవిష్కరణల వల్ల దాదాపు 93 మిలియన్ల మంది ఉద్యోగులు సామూహిక స్థానభ్రంశానికి గురి కాబోతున్నారనేది. ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్లుఇఎఫ్) 'ఉద్యోగుల భవిష్యత్తు' పేరిట విడుదల చేసిన నివేదికలో ఈ హెచ్చరికను చేసింది. రెండోదిబీ లార్సన్ అండ్ టూబ్రో (ఎల్ అండ్ టీ) చైర్మన్ ఎస్.ఎన్. సుబ్రహ్మణ్యన్ 90 గంటల పని వారాన్ని అమలు చేయాలని ప్రతిపాదించారు అనేది.సుబ్రమణ్యన్ ఒక ఆంతరంగిక సమావేశంలో యథాలాపంగా అన్న మాటల్ని పట్టించుకోవాల్సిన పనిలేదని ఆ సంస్థ ప్రతినిధులు అంటున్నారు. సుబ్రమణ్యన్ మాట్లాడింది ఒక విధానానికి సంబంధించిన అంశం కనుక ఎక్కడ అన్నారూ అనేదానికన్నా ఏమన్నారూ అనేదే ప్రధానం. సుబ్రమణ్యన్ ప్రతిపాదన ప్రకారం వారానికి ఏడు పనిదినాలయితే రోజుకు 13 గంటలు పనిచేయాలి. ఆరు పనిదినాలయితే రోజుకు 15 గంటలు పనిచేయాలి. ఐదు పనిదినాలయితే రోజుకు 18 గంటలు పనిచేయాలి. గతంలో ఇన్ఫోసిస్ అధినేత నారాయణమూర్తి కూడ 70 గంటల పనివారాన్ని ప్రతిపాదించారు. వారి ఉద్దేశ్యం కూడా సిబ్బందితో రోజుకు 14 గంటలు పని చేయించాలనే. కార్మిక సంఘాలు, సామ్యవాదులు మాత్రమే గాక మానవతావాదులు, సామాన్యులు సహితం ఇలాంటి ప్రతిపాదనల్ని సహజంగానే తీవ్రంగా వ్యతిరేకిస్తారు. నిజానికి ఈ రెండు వార్తలూ పరస్పర విరుద్ధంగా ఉన్నాయి. మొదటిది%–% ఉన్న ఉద్యోగాలే ఊడిపోతాయి అంటుంటే, రెండోది, శ్రామికులు మరిన్ని అదనపు గంటలు పనిచేయాలంటున్నది. ప్రత్యర్థుల నోరు మూయించడానికి మన ఏలినవారు ఇటీవలి కాలంలో దేశభక్తిని తిరుగులేని ఆయుధంగా వాడుతున్నారు. ఇథనాల్ ఫ్యాక్టరీలు విడుదల చేసే కాలుష్యానికి వ్యతిరేకంగా స్థానికులు ఆందోళన చేస్తుంటే, వాళ్ళ నోళ్లు మూయించడానికి కూడా దేశభక్తిని ముందుకు తెస్తున్నారు. శిలాజ ఇంధనమైన ముడి చమురును దిగుమతి చేసుకోవడానికి భారీగా విదేశీ మారక ద్రవ్యాన్ని చెల్లించి దేశం అప్పుల పాలవుతున్నదనీ, ఇథనాల్ వంటి జీవ ఇంధనాలను ఇక్కడే తయారు చేస్తే దేశం మీద రుణభారం తగ్గుతుందనీ ఆ వాదన సారాంశం. పని గంటల విషయం లోనూ ఇదే వాదన. మన దేశం చైనాను అధిగమించాలంటే భారత ఉద్యోగులు–, శ్రామికులు అధికంగా శ్రమించాలంటున్నారు. భారతదేశ భవిష్యత్తు ఇప్పుడు శ్రామికుల చేతుల్లోనే ఉంది అనే మాటలూ వినిపిస్తున్నాయి. భూమి, ఆకాశం, సముద్రాలు, అడవులు, కొండలు, గనులతోపాటు దేశ శ్రామికుల్ని కూడా ప్రభుత్వం మెగా కార్పొరేట్లకు అప్పచెపుతోంది. శ్రామికులు మారు మాట్లాడకుండా దేశభక్తి పారవశ్యంతో రోజుకు 24 గంటలు పని చేస్తే భారతదేశం చైనాను ఏమిటీ, ఏకంగా అమెరికాను సహితం అధిగమిస్తుంది అనేది ఏలినవారు చెప్పదలచుకున్న సిద్ధాంతం. 16వ శతాబ్దంలో ఆధునిక యంత్రాల మీద ఉత్పతి విధానం మొదలయినప్పుడే మనిషి ఒక రోజులో ఎంత సమయం శ్రమించాలి అనే చర్చ కూడా మొదలయింది. ఇందులో తాత్త్వక, ధార్మిక, సాంస్కృతిక దృక్పథాలు ఉన్నాయి. శ్రమించడం దైవారాధనకు మరో రూపం, సాతాను ప్రభావంలో ఉన్నవాళ్ళు శ్రమించరు %–% వంటి భావనని జాన్ కాల్విన్ వంటివాళ్ళు ముందుకు తెచ్చారు. అంతకుముందే సెయింట్ బెనెడిక్ట్ రులే వంటివారు ప్రార్థన, శ్రమ, విశ్రాంతుల మధ్య సమయ విభజన చేయడానికి ప్రయత్నించారు. 18వ శతాబ్దపు బెంజామిన్ ఫ్రాంక్లిన్ %జుఖతీశ్రీవ్ శీ ఎవస ఖఅస ముతీశ్రీవ్ శీ తీఅంవ% అంటూ మనందరికీ బాగా తెలిసిన నీతిని చెపుతూ త్వరగా పడుకొని త్వరగా లేచే మనిషిని ఆరోగ్యం, ధనం, జ్ఞానం వరిస్తాయి అని ఆశపెట్టాడు. ఇస్లాం ప్రబోధించే ఉపవాసాల్లోనూ ఎప్పుడు లేవాలి, ఎప్పుడు పడుకోవాలి అనే అంశాలతో పాటు మనిషి తన జీవితాన్ని, ఆర్థిక సామాజిక కర్తవ్యాలని సూర్యోదయ సూర్యాస్తమయాలతో అనుసంధానం చేయాలనే సూచనలు ఉంటాయి. తరువాత ఆడమ్ స్మిత్, మాక్స్ వేబర్ వంటి అర్థశాస్త్ర, సమాజశాస్త్ర ఆదిపురుషులు వచ్చారు. సమయం అంటే డబ్బు అనే మాట అప్పుడే పుట్టింది. అయితే, వీళ్ళందరూ తమకు తెలిసో తెలియకో పెట్టుబడిదారులకు, పారిశ్రామికవేత్తలకు అనుకూలమైన వాదనలు చేశారు దానికి విరుద్ధమైన వాదనలు కూడా అప్పట్లోనే వచ్చాయి. మనందరం ఏ తొమ్మిదో తరగతిలోనో న్యూటన్ చలన సూత్రాలను చదివి ఉంటాం. అందులో బాగా గుర్తుండిపోయేది: ప్రతి చర్యకు తత్సమానమైన వ్యతిరేకమైన ప్రతిచర్య ఉంటుంది అనేది. మనం తరచూ అక్కడితో ఆగిపోతాం. ఆ ప్రతిచర్య కూడా ఒక చర్య అయినప్పుడు దానికీ ఒక ప్రతిచర్య ఉంటుందని గుర్తించం. ఇలాంటి చర్య ప్రతిచర్యల నిరంతర కొనసాగింపే గతితర్కం. ఆహార సేకరణ కాలంలో మనిషి కూడా దాదాపు జంతువుల్లానే జీవించాడు. అయితే, మనిషి పరికరాలు, యంత్రాలను సృష్టించి వాటిని విస్తృతంగా వాడడం మొదలు పెట్టాక సమయ పాలన అతన్ని జంతు ప్రపంచం నుంచి పూర్తిగా విడగొట్టేసింది. ఆహార నిద్రా మైథునాలనే శరీర ధర్మాలు, మతం, వాణిజ్యం వంటి సాంస్కృతిక, సామాజిక ధర్మాలతోపాటు శ్రమకు ఎంత సమయాన్ని కేటాయించాలనే అంశం చర్చకు వచ్చింది. రోజుకు 24 గంటలు అనుకుంటే దాన్ని మూడు భాగాలు చేసి మొదటిదాన్ని శ్రమకు, రెండోదాన్ని సమాజానికీ, మూడోదాన్ని విశ్రాంతికీ కేటాయించాలనే అభిప్రాయం క్రమంగా బలపడింది.

# హైదరాబాద్‌లో భారీగా డ్రగ్స్ పట్టివేత..






ప్రజా స్వేచ్ఛ ఎల్బీనగర్

నేరేడ్మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు అంతరాష్ట్ర నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి 190 గ్రాముల హెరాయిన్, ద్విచక్రవాహనం, మొబైల్స్ సహా ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. వీటి మొత్తం విలువ రూ. 23 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. మీడియాకు రాచకొండ కమిషనరేట్ సీపీ సుధీర్ బాబు వివరాలు తెలిపారు. నిందితులు రాజస్థాన్‌కు చెందిన మహేష్, మహిపాల్ గుర్తించినట్లు చెప్పారు. హైదరాబాద్‌లో అధిక ధరలకు నిందితులు హెరాయిన్ విక్రయిస్తున్నారని అన్నారు. నిందితులు రాజస్థాన్‌కు చెందిన వారైనా నేరేడ్మెట్ పరిధిలో స్థిరపడ్డారని అన్నారు. వినియోగదారులకు డ్రగ్స్ చేరవేయడంలో డిఫరెంట్ మెథడ్స్ వాడుతున్నారన్నారు. నిందితులు గ్యాస్ సిలిండర్ రిపేర్లు చేసే వారిగా పనిచేస్తున్నారని తెలిపారు. గ్యాస్ రిపేర్‌కు సంబంధించిన పరికరాల్లో ప్యాక్ చేసి డ్రగ్స్ సరఫరా చేస్తున్నారని అన్నారు. గ్యాస్ సిలిండర్ వాల్వ్‌లలో ప్యాక్ చేసి విక్రయిస్తున్నారని తెలిపారు. అనుమానం రాకుండా ఇలాంటి టెక్నిక్స్ వాడుతున్నారని చెప్పారు. వోలా, ఊబర్, రాపిడో సహా ఇతర మార్గాల ద్వారా వీటిని కస్టమర్లకు చేరవేస్తున్నారన్నారు. 200 గ్రాముల హెరాయిన్ లక్ష రూపాయలకు కొనుగోలు చేసి... దానిని దాదాపు రూ. 23 నుంచి 25 లక్షల వరకు విక్రయిస్తున్నారన్నారు. రాజస్థాన్‌కు చెందిన శంషుద్దీన్ అనే డ్రగ్ పెడ్లర్ నుంచి నిందితులు డ్రగ్స్ కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. 2024 నుంచి ఇప్పటి వరకు రాచకొండ పరిదిలో దాదాపు రూ. 88 కోట్ల విలువైన డ్రగ్స్ సీజ్ చేశామని తెలిపారు. కమిషనరేట్ పరిధిలో డ్రగ్స్‌ను పూర్తిగా నిర్మూలించేందుకు నిరంతరం కృషి చేస్తూనే ఉంటామని చెప్పారు. పిల్లలు, యువత ఇలాంటి మత్తు పదార్థాలకు బలికావద్దంటే... ప్రజల సహకారం కూడా కావాలని చెప్పారు. డ్రగ్స్ సమాచారం ఉంటే తమకు తెలియజేయాలన్నారు. వీటిపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కళాశాలల్లోకి వెళ్లి యాంటీ ర్యాగింగ్, డ్రగ్స్‌పై అవగాహన కల్పిస్తున్నామన్నారు. నిన్న జరిగిన కాల్పుల ఘటనకు సంబంధించి తమ కమిషనరేట్ పరిధిలోని పోలీసులు కూడా వారిని పట్టుకునేందుకు చర్యలు చేపట్టారని సీపీ సుధీర్ బాబు తెలిపారు..



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి, కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

## గ్రామ సభలు నిర్వహణకు ఏర్పాట్లు

- ఎంపీడీఓ కుసుమ మాదూరీ



ఆమనగల్లు, జనవరి 17ప్రజా స్వేచ్ఛ

"ప్రభుత్వ ఆదేశాల ప్రకారం, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు మరియు కొత్త రేషన్ కార్డుల పై గ్రామ సభలు 13 గ్రామాలలో నిర్వహించనున్నారు," అని ఆమనగల్ ఎంపీడీఓ కుసుమ మాదూరీ తెలియజేశారు. "ఈ కార్యక్రమాలు ఈనెల 21 మరియు 22 తేదీలలో ఇందిరమ్మ కమిటీ సభ్యుల సమక్షంలో, గ్రామ ప్రజల సమక్షంలో, సంబంధిత అధికారుల ఆధ్వర్యంలో జరుగుతాయి" అని ఆమె పేర్కొన్నారు. 'పెద్ద ఎత్తున ప్రజలు హాజరుకావాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు ఇవ్వబడ్డాయి. సంబంధిత అధికారులకు రోజువారీ డ్యూటీలు కేటాయించినట్లు తెలిపారు. ఈ గ్రామ సభల ద్వారా ప్రజల సమస్యలు పరిష్కారం దిశగా నిర్ణయాలు తీసుకుంటామని" ఎంపీడీఓ కుసుమ మాదూరీ చెప్పారు. "ఈ గ్రామ సభలకు పెద్ద ఎత్తున ప్రజలు హాజరై, తమ సమస్యలను ప్రకటించాలి," అని ఆమె కోరారు.

## ఆమనగల్, తలకొండపల్లి ఏఎస్సైలకు ఎస్ఐలుగా పదోన్నతి



హైదరాబాద్, జనవరి 17ప్రజా స్వేచ్ఛ

ఆమనగల్ మరియు తలకొండపల్లి పోలీస్ స్టేషన్లలో ఏఎస్ఐలుగా సేవలందించిన కె. యాదయ్య, బి. సీతారాంరెడ్డిలు ఇటీవల ఎస్సైగా పదోన్నతి పొంది శిక్షణ పూర్తి చేసుకున్నారు. ఆమనగల్ సీఐ బి. ప్రమోద్ కుమార్ తన కార్యాలయంలో ఎస్సైలువెంకటేష్ మరియు శ్రీకాంత్ ల సమక్షంలో వారిరువురికి పదోన్నతి బ్యాడ్జీలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సీఐ బి. ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ, "గత ముప్పై ఏళ్లుగా మీరు పోలీసు శాఖలో నిబద్ధతతో విధులు నిర్వహించారు. భవిష్యత్తులో కూడా ఇదే విధంగా కృషి చేసి, పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని" సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై మురళిధర్ రెడ్డి సహా సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా పదోన్నతి పొందిన అధికారులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# తెలుగులో జీవోలు ! రుణమాఫీ,రైతు భరోసా, కొత్త రేషన్ కార్డుల జీవోలు మాతృభాషలోనే..!!

-ప్రధాన ఉత్తర్వులన్నీ తెలుగులో ఇస్తున్న సర్కార్
-భవిష్యత్ లోనూ ఉత్తర్వులన్నీ తెలుగులో ఇచ్చేలా ఏర్పాట్లు

ప్రజా స్వేచ్ఛ ఎల్బీనగర్

రాష్ట్ర ప్రభుత్వం కొత్త సంప్రదాయానికి తెరతీసింది. ఇన్నాళ్లూ ప్రభుత్వ జీవోలన్నీ ఇంగ్లిష్లోనే వచ్చేవి.కానీ,ఇటీవల సామాన్యులకు అర్థమయ్యేలా పలు జీవోలను సర్కారు తెలుగులో ఇస్తోంది. గతేడాది రుణమాఫీ జీవోను రాష్ట్ర ప్రభుత్వం తెలుగులో ఇచ్చింది.దీనిపై తెలుగు భాషాభిమానులతో పాటు సామాన్యుల్లో హర్షం వ్యక్తమైంది. అప్పటి నుంచి ప్రజలకి నేరుగా సంబంధం ఉన్న జీవోలన్నింటిని ఆయా శాఖలు తెలుగులోనే ఇచ్చే ప్రయత్నం చేస్తున్నాయి. వ్యవసాయ శాఖ నుంచి ఇటీవల రైతు భరోసా అమలు మార్గదర్శకాల జీవో కూడా తెలుగులోనే వచ్చింది.కొత్త రేషన్ కార్డుల జారీకి ఇచ్చిన ఉత్తర్వులు కూడా తెలుగులో స్పష్టంగా ఉన్నాయి.ఇతర శాఖల్లోనూ ముఖ్యమైన జీవోలను దశల వారీగా తెలుగులోనే ఇచ్చేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ప్రభుత్వ విధానాలు, నిర్ణయాలు,నిబంధనలు, సూచనలు ప్రజలకు తేలికగా అర్థమయ్యేందుకు ఇంగ్లిష్‌తో పాటు తెలుగులోనూ ఉత్తర్వులు జారీ చేయాలని అన్ని శాఖలను ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.ఈ విషయంలో తమిళనాడును అనుకరించాలని సూచించారు.

### ఆ జీవోకు 44 ఏండ్లు..

ప్రభుత్వ జీవోలు తెలుగులోనే ఇవ్వాలంటూ ఉమ్మడి ఏపీ ప్రభుత్వం1980లోనే ఓ జీవో ఇచ్చింది. కొన్నిశాఖల్లో కొంతకాలం అమలు చేసినప్పటికీ తర్వాత ఎందుకనో పక్కనపెట్టేశారు. ఫలితంగా ఇన్నేండ్లలో ఒకటి, అరా మినహా అన్ని జీవోలు ఇంగ్లిష్లోనే వచ్చాయి. దీంతో ఈ జీవోలను అర్థం చేసుకోవడం సామాన్యులకు కష్టసాధ్యమయ్యేది.ఇలాంటి జీవోలను ప్రజాప్రతినిధులు సైతం సరిగ్గా అర్థం చేసుకోలేక ఇబ్బందులపాలైన సందర్భాలు ఉన్నాయి.

ఈ క్రమంలో ప్రభుత్వ జీవోలన్నీ తెలుగులో ఇచ్చేందుకు ప్రయత్నిస్తామని తెలుగు,మాతృభాషా దినోత్సవాల సందర్భంగా గత ప్రభుత్వ పెద్దలు చెప్పారే తప్ప అమలుచేయలేదు.కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఈ దిశగా గట్టి ప్రయత్నాలు జరుగుతున్నాయి.తమ ప్రజాప్రభుత్వంలో జీవోల విషయంలో పూర్తి పారదర్శకత పాటిస్తామని,పబ్లిక్డొమైన్లో పెడ్తామని చెప్పిన కాంగ్రెస్ సర్కారు ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నది. ప్రతి ఒక్కరికీ సులువుగా అర్థమయ్యే రీతిలో ముఖ్యమైన జీవోలను తెలుగులో ఇస్తున్నది. ఇటీవల రైతుభరోసా, రేషన్కార్డుల మార్గదర్శకాలపై ఇచ్చిన జీవోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి.కాగా,ఈ జీవోలను తెలుగులోకి అనువాదించే బాధ్యతలను 'డైరెక్టర్ ఆఫ్ ట్రాన్స్‌లేషన్స్'కు ప్రభుత్వం అప్పగించినట్లు తెలిసింది.



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి, కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

# కలియుగ దైవం వెంకటేశ్వర స్వామి వారి నామ స్మరణంమే దైవచింతన

-స్వామి వారి కృపాకటాక్షాలు షాద్ నగర్ నియోజకవర్గం ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలి
-బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి
-చింతల శ్రీ వెంకటేశ్వర స్వామి కల్యాణమహోత్సవంలో పాల్గొన్న శ్రీవర్ధన్ రెడ్డి,అందె బాబయ్య



షాద్ నగర్, జనవరి 17(ప్రజా స్వేచ్ఛ)
వెంకిర్యాల ,విశ్వనాథ్ పూర్ గ్రామాల దగ్గర గత మూడు రోజులుగా అంగరంగ వైభవంగ కొనసాగుతున్న చింతల భూదేవి ,లక్ష్మీదేవి శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి గారు,అందె బాబయ్య గార్లు పాల్గొన్నారు.వారితో పాటు ఆలయకమిటీ చైర్మెన్ రాఘవేందర్ గౌడ్ ,శివారెడ్డి ,రామకృష్ణ రెడ్డి ,గోవింద్ ,లింగం గౌడ్ ,మసయ గౌడ్ ,వీరేశం ,వంశీ కృష్ణ,మల్చలం మురళి, ఎంకనోళ్లవెంకటేష్, కొమరబండ శ్రీశైలం,బోయ కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి గారు మాట్లాడుతూ ఆలయ ప్రాంగణంలో శ్రీ వేంకటేశ్వర స్వామి కళ్యాణోత్సవాన్ని పండితుల వేద మంత్రోచ్చారణల మధ్య కన్నుల పండువగా నిర్వహిస్తున్నారని కొనియాడారు. కలియుగ దైవమే శ్రీ వెంకటేశ్వర స్వామి నామ స్మరణమని,ప్రతీ ఒక్కరూ హిందూ ధర్మం కోసం పాటు పడాలని కోరారు. వెంకటేశ్వర స్వామి వారి ఆశీస్సులు షాద్ నగర్ నియోజకవర్గ ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని,పాడి పంటలతో సుఖసంతోషాలతో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బీజేపీ నాయకులను సన్మానించారు .కార్యక్రమములో భక్తులు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.చింతల జాతరలో తినుబండారాలను కొనుకోని చిన్ననాటి జ్ఞపకాలను గురుతుచేసుకున్నారు

# సనాతన ధర్మం,సంస్కృతి పరిరక్షణలోసమాజం కీలక భూమిక పోషించాలి

-జాతీయ ప్రచారక్ పెట్రియాటి చీఫ్ శివకరణ్ సింగ్



వనపర్తి, జనవరి 17(ప్రజా స్వేచ్ఛ)
సనాతన ధర్మం,సంస్కృతి పరిరక్షణలోసమాజం కీలక భూమిక పోషించాలిజాతీయ ప్రచారక్ పేట్రియాటిక్ శివకరణ్ సింగ్ శుక్రవారం వనపర్త లో అన్నారు.
ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ఫతేపూర్ జిల్లా ఖరోలి నుండి పాదయాత్ర చేపట్టి భారత, చైనా సరిహద్దు నీలం లోయ గుండా కన్యాకుమారి చేరుకున్నారు. అక్కడి నుండి మళ్ళీ తిరిగి ఖరోలీకి పాదయాత్ర చేస్తూ నిన్న రాత్రి వనపర్తి పట్టణానికి చేరుకున్న సందర్భంగా బిజెపి జిల్లా అధ్యక్షులు డి నారాయణ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ నాయకులు కావలి శీను బీజాపూర్ తిరుపాజీ విశ్వహిందూ పరిషత్ వాకిటి హర్షవర్ధన్ ఆధ్వర్యంలో అయన కి సాధర స్వాగతం పలికి ఘనంగా సత్కరించడం జరిగింది. ఈ సందర్భంగా జాతీయ ప్రచారక్ పేట్రియాటి శివకరణ్ సింగ్ మాట్లాడుతూ భరతమాతను పరమవైభవ స్థితిలో నిలుపుటకు సమాజాన్ని సన్నద్ధం చేయాల్సిన అవసరం ఉందని అందుకు తన పాదయాత్ర ఒక భూమిక కావాలన్నదే తన లక్ష్యమని, ప్రపంచంలో ఎక్కడ లేని యువ శక్తి దేశ సొంతమని వారి శక్తియుక్తులు దేశహితానికి ఉపయోగపడాలని ఆకాంక్షించారు. వ్యసన ధోరణల నుండి విముక్తి కల్పించి, దేశప్రయోజనాలకు వీలుగా వారిని తగురీతిలో సన్నద్ధం చేయటానికే తాను పాదయాత్ర చేపట్టినట్లు వివరించారు. ఈదేశాన్ని సుసంపన్నమైన, బలీయమైన, పటిష్టమైన స్థితిలో నిలపటానికి సమాజాన్ని జాగృతం చేయటమే తమ పాదయాత్ర లక్ష్యమన్నారు.

# సంస్కృతి సంప్రదాయాలతో పాటు పర్యావరణన్ని కాపాడుకుందాం.

– కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ అధ్యక్షురాలు లీలా లక్ష్మారెడ్డి.




కద్తాల్, జనవరి 17(ప్రజా స్వేచ్ఛ)
కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్, సిసిఆర్టి/డిఆర్పి లు సంయుక్తంగా నిర్వహిస్తున్న మూడు రోజుల జాతీయ విద్యా సదస్సు ఎర్త్ అండ్ కల్చర్ భూమి, సంస్కృతి అనే అంశం మీద శుక్రవారం రెండవ రోజు కార్యక్రమం శ్రీమతి లీలా లక్ష్మారెడ్డి, అధ్యక్షతన జరిగింది. అధ్యక్షురాలు మాట్లాడుతూ ఈరోజుల్లో రిక్వెస్ట్ పర్యావరణ పరిరక్షణ మానవత విలువలు చాలా అవసరమని, సమాజము, దేశము, ప్రపంచము శాంతియుతంగా ఉండాలంటే ఉపాధ్యాయులు, విద్యార్థులు సమాజంలో ఉన్న ప్రతి ఒక్కరూ భాద్యతగా ఉండాలని సూచించారు. ఎర్త్ కు సంబంధించి ఫారెస్ట్ వాక్ వ్యాల్యూ వాచ్ యంగ్ ఎర్త్ లీడర్స్ ప్రోగ్రాం కార్యక్రమాలు ఎన్విరాన్మెంట్ సైంటిస్ట్ డాక్టర్ సాయి భాస్కర్ రెడ్డి డాక్టర్ ఉమామహేశ్వర్ రెడ్డి గార్లు నిర్వహించారు. తెలంగాణ సంస్కృతిలో భాగంగా పేరిణి నృత్యం అన్నలదేవి రాజేష్, లాస్య నృత్యం పెరుమాండ్ల వేణుగోపాల్, నాట్యాచార్యులు బోనాల పండుగ, నృత్యము కత్తి స్వరూప రాణి గార్ల బృందము చేత నిర్వహించబడినది. సిజిఆర్ వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీ కే లక్ష్మారెడ్డి, కార్యక్రమ నిర్వాహకులు సిసిఆర్టి డిఆర్పీలు గన్నారం ప్రభాకర్, పంజా రాజమల్లు, వెంకటేశ్వరరావు, నాగరాజు, సిజిఆర్ కార్యాలయ సిబ్బంది అనుదీప్, నగేష్, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన పెరుమాండ్ల సురేష్



హైదరాబాద్, జనవరి 17(ప్రజా స్వేచ్ఛ)
కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పుట్టిన రోజు సందర్భంగా తలకొండపల్లి యువ నాయకుడు పెరుమాండ్ల సురేష్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు ఆయన మాట్లాడుతూ, "కసిరెడ్డి నారాయణరెడ్డి బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, అలుపెరుగని ప్రజా సేవకులు. ఆయన అలోచనలు, సేవా ధనాలు ప్రజలకు స్ఫూర్తిదాయకం" అని పేర్కొన్నారు. ఆయనకు నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. ప్రజా నాయకుడు కసిరెడ్డి నారాయణరెడ్డి పుట్టినరోజు వేడుకల్లో పేదలకు సాయమందించడంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించారు. "నిరాడంబరుడు, దానవీరుడు, ప్రజల మనిషి"గా ఆయనను ప్రశంసించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నేతలు, ప్రజలు, అభిమానులు ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయన ప్రతి అడుగు ప్రజల శ్రేయస్సుకోసమేనని విశ్వాసం వ్యక్తం చేశారు.

# ఆశ వర్కర్ల సమస్యలపై సిఐటియు వినతిపత్రం



హైదరాబాద్, జనవరి 17(ప్రజా స్వేచ్ఛ)
ఆమనగల్ పిహెచ్ ఎస్ డాక్టర్ పరీక్షిత్ కు ఈ రోజు సిఐటియు అనుబంధ సంఘం ఆశ వర్కర్లు వారి సమస్యలపై వినతిపత్రం అందించారు. సిఐటియు ఆమనగల్ ఏరియా కన్వీనర్ జల్లెల్ల పెంటయ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు ఆశ వర్కర్లు తమ వేతనాలను 18000 రూపాయలుగా ఫిక్స్ చేయాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసిన అనంతరం జల్లెల్ల పెంటయ్య మాట్లాడుతూ, "కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటినుండి అనేక పోరాటాలు చేసినప్పటికీ స్పందన లేకపోవడంతో, ఈ నెల 21న మంగళవారం బొంగులూరు గేట్ నుండి మన్నెగూడ వరకు 10 కే రన్ నిర్వహించనున్నాము. ఆశ వర్కర్లు ఈ పోరాటంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరుతున్నాము" అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు అనిత, ప్రధాన కార్యదర్శి చంద్రకళ, బేబీ తదితరులు పాల్గొన్నారు. వారు ఆశ వర్కర్లకు పూర్తి మద్దతు ఇచ్చినట్లు తెలియజేశారు.

# రోడ్డు భద్రత అందరి బాధ్యత

-షాద్ నగర్ రవాణా శాఖ అధికారి వాసు




షాద్ నగర్, జనవరి 17(ప్రజా స్వేచ్ఛ)
రోడ్డు భద్రత అందరి బాధ్యత అని రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్ వాసు అన్నారు. శుక్రవారం షాద్నగర్ పట్టణంలో భారీ వాహనాల డ్రైవర్లకు ఆయన తన సిబ్బందితో కలిసి అవగాహన కల్పించారు. జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా నెలరోజుల పాటు ట్రాఫిక్పై వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా భారీ వాహనాలను గుర్తించి వాటికి స్టిక్కర్లను అంటించారు. ఈ సందర్భంగా వాసు మాట్లాడుతూ రహదారిపై ఉండే సూచనలను పాటిస్తే రోడ్డు ప్రమాదాలను అరికట్టవచ్చన్నారు. ప్రతి ఒక్కరు ట్రాఫిక్పై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. డ్రైవర్లు సెల్ఫోన్లో మాట్లాడుతూ వాహనాలు నడపడం, మద్యం తాగి నడపడం వల్లే ఎక్కువ శాతం ప్రమాదాలు జరుగుతన్నాయని వివరించారు. అంతేకాదు డ్రైవర్లకు సైతం విశ్రాంతి ఖచ్చితంగా అవసరమన్నారు. డ్రైవర్లకు కంటి పరీక్షలు, బీపీ, షుగర్ వంటి పరీక్షలు నిత్యం చేయించుకోవడం మంచిదన్నారు. కొంతమంది తమ గమ్యస్థానాలకు చేరుకోవాలన్న ఆతృతతో పరిమితికి మించిన వేగంతో వాహనాలు నడపడం, అదేవిధంగా పరిమితికి మించి వాహనాల్లో ఎక్కువ మందిని కూర్చోబెట్టుకోవడం వల్ల ప్రమాదాలు జరుగుతాయన్నారు. ఎలాంటి వాహనాలైనా వెనక భాగంలో రెడ్ రేడియం స్టిక్కర్లు, ముందు భాగం వైట్ రేడియం స్టిక ర్లు ఉండాలని అన్నారు. వాహనాలు కండీషన్లో ఉండేవిధంగా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంవీఐ ఫయాజ్ హుస్సేన్, కానిస్టేబుళ్లు శ్రీకాంత్, వినయ్ కుమార్, డీవీఐ సంతోష్ రెడ్డి, హోమ్గార్డులు భూపాల్, అశోక్, స్టార్ ట్రాన్స్పోర్ట్ జమీల్, తదితరులు పాల్గొన్నారు..

# అర్హులైన ప్రతీ పేదవాడికి ఇందిరమ్మ ఇళ్లు

- ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి
-మోడల్ ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన



ఇబ్రహీంపట్నం,జనవరి 17(ప్రజా స్వేచ్ఛ)
ఇల్లులేని ప్రతీ పేదవాడికి ఇల్లు ఇచ్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఇందిరమ్మ మోడల్ ఇంటి నిర్మాణనికి భూమి పూజ చేశారు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి . ఈసంద్భంగా మాట్లాడుతూ... ఇంటి నమూనాను మండల కేంద్రానికి వచ్చే వివిధ గ్రామాల ప్రజలకు అర్థమయ్యేలా అవగాహన కల్పించా లని అన్నారు. నియోజకవర్గంలో అర్హులైన ప్రతీ పేద వారికి ఇందిరమ్మ ఇల్లు ఇచ్చే బాధ్యత తనదని మొదటి విడతగా 3500 ఇళ్ల ను నిర్మించి ప్రతీ గ్రామంలో నిజమైన పేద వారిని గుర్తించి ఇల్లు అందిస్తామని నియోజకవర్గం మొత్తం 20 వేల ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి పేదలకు అందించే బాధ్యత తమదన్నారు. ఎన్నికల సమయంలో మేము ఇచ్చిన 6 గ్యారంటీలను పూర్తి స్థాయిలో ప్రజలకు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్లు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, కౌన్సిలర్లు , కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులతో పాటు , ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

# బిజినెస్

## మూడు శాతం వృద్ధి చెందిన రిలయన్స్ షేర్..

### కారణమిదే..!



దేశీయ స్టాక్ మార్కెట్లో శుక్రవారం రిలయన్స్ షేర్లు దాదాపు మూడు శాతం లాభాలతో ముగిశాయి. గురువారం రిలయన్స్ ఇండస్ట్రీస్ మూడో త్రైమాసికంలో 7.4శాతం నికర లాభం గడించిన సంగతి తెలిసిందే. బీఎస్ఈలో రిలయన్స్ షేర్ 2.57 శాతం వృద్ధితో రూ.1301.30 వద్ద ముగిసింది. అంతర్గత ట్రేడింగ్‌లో 4.44శాతం పుంజుకుని రూ.1,3265.10లకు దూసుకెళ్లింది. మరోవైపు ఎన్ఎస్ఈలో రిలయన్స్ షేర్ 2.64శాతం వృద్ధితో రూ.1,300 వద్ద స్థిర పడింది. అంతర్గత ట్రేడింగ్‌లో 4.70 శాతం వరకూ వృద్ధితో రూ.1,326 వరకూ పెరిగింది. దీంతో కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.44,115.55 కోట్లు పెరిగి రూ.17,60,967.69 కోట్లకు చేరుకుంది. బీఎస్ఈలో 15.14 లక్షల షేర్లు, ఎన్ఎస్ఈలో 293.66 లక్షల షేర్లు ట్రేడయ్యాయి.రిటైల్ బిజినెస్ పుంజుకోవడం, టారిఫ్‌ల పెంపుతో జియో ఆదాయం పెంపు, ఆయిల్ అండ్ గ్యాస్‌తో కూడిన పెట్రో కెమికల్ బిజినెస్ నికరంగా లాభాలు గడించడంతో డిసెంబర్ త్రైమాసికంలో రిలయన్స్ 7.4 శాతం వృద్ధితో రూ.18,540 కోట్ల నికర లాభం గడించింది. ఏడాది క్రితం అంటే 2023-24 తృతీయ త్రైమాసికంలో రూ.17,265 కోట్ల నికర లాభం పొందింది.

## భారీగా పతనమైన ఫారెక్స్ రిజర్వ్ నిల్వలు..

## 625.871 బిలియన్ డాలర్లకు పరిమితం..!

భారత్ ఫారెక్స్ రిజర్వ్ నిల్వలు భారీగా తగ్గాయి. ఈ నెల పదో తేదీతో ముగిసిన వారానికి ఫారెక్స్ రిజర్వు నిల్వలు 8.714 బిలియన్ డాలర్లు పతనమై 625.871 బిలియన్ డాలర్లకు పడిపోయాయని ఆర్బీఐ శుక్రవారం తెలిపింది. ఈ నెల మూడో తేదీతో ముగిసిన వారంలోనూ ఫారెక్స్ రిజర్వ్ నిల్వలు 5.693 బిలియన్ డాలర్లు పతనమై 634.585 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయని ఆర్బీఐ వెల్లడించింది. గత కొన్ని వారాలుగా ఫారెక్స్ రిజర్వ్ నిల్వలు తగ్గుతూ వస్తున్నయి. అంతర్జాతీయంగా ఫారెక్స్ మార్కెట్లో అనిశ్చితి నెలకొన్నప్పుడు రూపాయి విలువ పతనం కాకుండా ఆర్బీఐ బహిరంగ మార్కెట్లో డాలర్లు విక్రయిస్తున్నది. 2024 సెప్టెంబర్ నెలాఖరులో ఫారెక్స్ రిజర్వు నిల్వలు రూ.704.885 బిలియన్ డాలర్లతో జీవిత కాల గరిష్టాన్ని తాకాయి.ఈ నెల పదో తేదీతో ముగిసిన వారానికి ఫారిన్ కరెన్సీ అసెట్స్ 9.469 బిలియన్ డాలర్లు తగ్గిపోయి 536.011 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయని ఆర్బీఐ శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది. బంగారం రిజర్వు



నిల్వలు 792 మిలియన్ డాలర్లు క్షీణించి 67.883 బిలియన్ డాలర్ల వద్ద స్థిర పడ్డాయి. స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ (ఎస్‌డీఆర్ఎస్).. 33 మిలియన్ డాలర్లు పడిపోయి 17.781 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్)లో భారత్ ఫారెక్స్ రిజర్వ్ నిల్వలు 4 మిలియన్ డాలర్లు పతనమై 4.195 బిలియన్ డాలర్లకు పరిమితం అయ్యాయని ఆర్బీఐ వెల్లడించింది.

## ఆల్‌టైం గరిష్టానికి బంగారం ధరలు.. !

దేశీయ బులియన్ మార్కెట్లో స్థానికుల నుంచి కొనుగోళ్ల మద్దతు లభించడంతో వరుసగా మూడో రోజు బంగారం ధరలు పెరిగాయి. దేశ రాజధాని ఢిల్లీలో శుక్రవారం 99.9శాతం స్వచ్ఛత గల బంగారం తులం ధర రూ.700 వృద్ధి చెంది రికార్డు గరిష్ట స్థాయికి చేరువైంది. శుక్రవారం తులం బంగారం ధర రూ.82,000 పలికింది. గురువారం 99.9 శాతం స్వచ్ఛత గల బంగారం తులం ధర రూ.81,300 వద్ద స్థిర పడింది. ఆభరణాల తయారీలో వినియోగించే 99.5 శాతం స్వచ్ఛత గల బంగారం తులం ధర వరుసగా మూడో రోజూ రూ.700 వృద్ధితో 81,600 ముగిసింది. గురువారం 99.5శాతం స్వచ్ఛత గల బంగారం తులం ధర రూ.80,900 వద్ద స్థిర పడింది. మరోవైపు, శుక్రవారం కిలో వెండి ధర రూ.500 తగ్గి



రూ. 93,500 వద్ద ముగిస్తే, బుధవారం రూ.94,000 వద్ద స్థిర పడింది. గతేడాది అక్టోబర్ 31న 99.9 శాతం స్వచ్ఛత గల బంగారం తులం ధర రూ.82,400, 99.5 శాతం స్వచ్ఛత గల బంగారం తులం ధర రూ.82,000లతో జీవిత కాల గరిష్టాన్ని తాకింది.అంతర్జాతీయ మార్కెట్లో బలహీన ధోరణులు నెలకొన్నా, దేశీయంగా జ్యువెల్లర్లు, వ్యాపారుల నుంచి అధిక డిమాండ్ ఉండటంతో బంగారం ధరలకు రెక్కలొచ్చాయి. ఇక మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో గోల్డ్ కాంట్రాక్ట్ ఫిబ్రవరి డెలివరీ తులం ధర రూ.424 (0.54 శాతం) తగ్గి రూ.78,802 వరకూ పెరిగి ముగింపు సమయానికి రూ.78,800లకు చేరుకుందని ఎల్‌కేపీ సెక్యూరిటీస్ కమోడిటీ అండ్ కరెన్సీ అనలిస్ట్ ఉపాధ్యక్షులు జతిన్ త్రివేది చెప్పారు. మధ్య ప్రాచ్యంలో ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టడంతోపాటు ద్రవ్యోల్బణంతోపాటు అమెరికా డేటా పాజిటివ్‌గా ఉండటంతో బంగారం ధర పెరుగుదలపై ఆశలు పెరిగాయన్నారు. ఎంసీఎక్స్‌లో శుక్రవారం కిలో వెండి మార్చి డెలివరీ ధర రూ.1,093 (1.18 శాతం) తగ్గి రూ.91,710 పలికింది.

## రాట్ కోహ్లీ రంజీల్లో ఆడుతాడా..?

రంజీ ట్రోఫీలో భాగంగా సౌరాష్ట్రతో జరిగే మ్యాచ్‌కు ఢిల్లీ 22 మంది సభ్యులతో ప్రాబుల్స్‌ను ప్రకటించింది. ఇందులో టీమిండియా స్టార్ ప్లేయర్ కోహ్లీ పేరు సైతం ఉన్నది. ఈ నెల 23న రాజ్‌కోట్‌లో జరుగనున్న ఈ మ్యాచ్‌లో ఆడుతాడా? లేదా? అన్నది ఇంకా స్పష్టత లేదు. ప్రస్తుతం మెడ గాయంతో ఇబ్బందిపడుతున్నట్లు సమాచారం. ఈ మేరకు ఢిల్లా జిల్లా క్రికెట్ అసోసియేషన్ (%ణణజూా%) అధికారులకు సమాచారం ఇచ్చినట్లు పేర్కొంది. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ సిడ్నీ టెస్టులో గాయమైనట్లు తెలుస్తున్నది. ఇప్పటికే గాయాన్ని ఫిజియో పరిశీలించారు. ఈ క్రమంలో విరాట్ రంజీల్లో పాల్గొంటాడా? అన్నది వేచి చూడాల్సిందే. కోహ్లీ చివరిగా 2012లో ఉత్తరప్రదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ తరఫున టెస్టు మ్యాచ్ ఆడాడు. భారత జట్టు వికెట్ కీపర్ బ్యాట్స్‌మన్ రిషబ్ పంత్ దాదాపు ఎనిమిది సంవత్సరాల తర్వాత రంజీ ట్రోఫీలో ఆడనున్నాడుకెప్టెన్‌గా ఉండేందుకు నిరాకరించినట్లు సమాచారం. ఆయుష్ బడోనీకి జట్టు బాధ్యతలు అప్పగించే అవకాశం ఉందని, బడోనీ జట్టుకు కెప్టెన్‌గా ఉండాలని పంత్ సైతం భావిస్తున్నట్లుగా



డీడీసీఏ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు పేర్కొన్నారు. రంజీలకు తాను అందుబాటులో ఉంటానని.. కానీ, కెప్టెన్ రోల్ అవసరం లేదని పంత్ పేర్కొనట్లుగా ఆయన తెలిపారు. ఇదిలా ఉండగా.. న్యూజిలాండ్, ఆస్ట్రేలియాతో జరిగిన వరుస టెస్ట్ సిరీస్‌లలో టీమిండియా ఓటమి పాలైంది. ఈ క్రమంలో ప్రతి క్రికెటర్ రంజీల్లో ఆడాల్సిందేనని బీసీసీఐ స్పష్టం చేసింది. ఈ మేరకు కొత్తగా రూల్స్‌ను తీసుకువచ్చింది. ఇప్పటికే కెప్టెన్ రోహిత్ శర్మ ముంబయి జట్టుతో ఆడేందుకు ప్రాక్టీస్ చేస్తున్నాడు. మ్యాచ్‌కు అందుబాటులో ఉంటాడా? లేదా? అన్నది ఇంకా క్లారిటీ లేదు. ఇక యశస్వి జైస్వాల్ ముంబయి తరఫున, శుభ్‌మాన్ గిల్ పంజాబ్ తరఫున రంజీల్లో ఆడనున్నారు

## చమటోడుస్తున్న రోహిత్ శర్మ..

### హార్దిక్ పాండ్యాతో కలిసి నెట్స్‌లో సాధన..

బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో బ్యాటింగ్‌తో నిరాశ పరిచిన కెప్టెన్ రోహిత్ శర్మ ముమ్మరంగా ప్రాక్టీస్ చేస్తున్నాడు. త్వరలో ఇంగ్లాండ్‌తో వన్డే సిరీస్‌తో పాటు కీలకమైన ఛాంపియన్స్ ట్రోఫీలో టీమిండియా పాల్గొననున్నది. ఈ నేపథ్యంలో ముంబయి జట్టు, ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యాతో కలిసి హిట్‌మ్యాన్ ప్రాక్టీస్ చేస్తున్నాడు. ఈ నెల 22 ఇంగ్లాండ్‌తో జరిగే ఐదు మ్యాచుల టీ20 సిరీస్‌కు కోల్‌కతాలో జరుగనున్న క్యాంప్ కోసం పాండ్యా వెళ్లనుండగా.. రోహిత్ మాత్రం ముంబయి జట్టుతోనే కలిసి ఉంటాడు. ఇంగ్లాండ్‌తో వన్డే సిరీస్, ఛాంపియన్స్ ట్రోఫీకి భారత్ ఇంకా జట్టును ప్రకటించలేదు. సెలెక్టర్లు ప్రస్తుతం టీమిండియా ఎంపికపై కసరత్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా..



రోహిత్, పాండ్యా కలిసి ప్రాక్టీస్ చేస్తున్న వీడియోను ఓ అభిమాని సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. రోహిత్ నెట్స్‌లో వైట్‌బాల్‌తో బ్యాటింగ్, హార్దిక్ బౌలింగ్ ప్రాక్టీస్ చేస్తూ కనిపించాడు.ఇంగ్లాండ్‌తో జరిగే వన్డే సిరీస్‌లో రోహిత్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. చాంపియన్స్ ట్రోఫీ రోహిత్ కెరియర్‌లో కీలకంగా మారబోతుంది.

సిరీస్‌లో హిట్‌మ్యాన్ విఫలమైతే మరింత ఇబ్బందికర పరిస్థితి ఎదుర్కొనే అవకాశం ఉంది. ఇప్పటికే వరుస టెస్టుల్లో టీమిండియా ఓటమి, ఫామ్ లేమితో రోహిత్ విమర్శలు ఎదుర్కొగా.. ఆస్ట్రేలియా పర్యటనలో చివరి టెస్టుకు దూరమైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో తిరిగి ఫిట్‌నెస్ సాధించేందుకు నెట్స్‌లో తీవ్రంగా శ్రమిస్తున్నాడు. ముంబయి రంజీ జట్టుతో కసరత్తులు చేస్తున్నాడు. ఇక ఇంగ్లాండ్‌తో జరిగే T 20 సిరీస్‌కు ముందు భారత జట్టు కోల్‌కతాలో మూడు రోజుల శిబిరంలో పాల్గొంటుంది. సూర్యకుమార్ కెప్టెన్సీలోని టీమిండియా.. ఇంగ్లాండ్‌తో తలపడనున్నది. సూర్యకుమార్ నాయకత్వంలో శ్రీలంక, బంగ్లాదేశ్, దక్షిణాఫ్రికాపై సిరీస్‌లను గెలిచింది.

# స్పోర్ట్స్


## ఫిబ్రవరిలో డబ్ల్యూపీఎల్.. వడోదరలో మొదలై.. ముంబైలో ముగియనున్న టోర్నీ



అమ్మాయిల ధనాధన్ క్రికెట్‌కు రంగం సిద్ధమైంది. మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) 3వ సీజన్ షెడ్యూల్ వచ్చేసింది. వచ్చే నెల 14 నుంచి మార్చి 15 దాకా నెల రోజుల పాటు పొట్టి క్రికెట్ వినోదాన్ని డబ్ల్యూపీఎల్ అందించనుంది. ఈ మేరకు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) గురువారం డబ్ల్యూపీఎల్-3 షెడ్యూల్‌ను ప్రకటించింది. 20 లీగ్ మ్యాచ్‌లు, 2 నాకౌట్ మ్యాచ్‌లు (మొత్తం 22) జరుగబోయే ఈ మెగా టోర్నీని వడోదర, బెంగళూరు, లక్నో, ముంబై నగరాలలో నిర్వహించనున్నారు. గతేడాది ఢిల్లీ, బెంగళూరు, ముంబైలలో ఈ టోర్నీని నిర్వహించగా తాజాగా ఢిల్లీ స్థానంలో వడోదర, లక్నో చేరాయి. ఫిబ్రవరి 14న డిఫెండింగ్ చాంపియన్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) గుజరాత్ జెయింట్స్‌తో మ్యాచ్‌తో టోర్నీ ప్రారంభం కానుంది.

**వడోదరలో మొదలై.. ముంబైలో ముగిసి..**

ఫిబ్రవరి 14న బరోడా (వడోదర)లో కొత్తగా నిర్మించిన బీసీఏ స్టేడియంలో తొలి ఆరు మ్యాచ్‌లు జరుగనున్నాయి. ఐదు జట్లూ ఇక్కడ నుంచే తమ టైటిల్ వేటను మొదలుపెడతాయి. ఫిబ్రవరి 21 నుంచి బెంగళూరుకు షిఫ్ట్ అయ్యే ఈ టోర్నీలో మార్చి 1 వరకు 8 మ్యాచ్‌లు జరుగుతాయి. మార్చి 3 నుంచి 8 దాకా లక్నో.. 4 మ్యాచ్‌లకు ఆతిథ్యమివ్వనుండగా 10 నుంచి టోర్నీ ముంబైలో జరుగుతుంది. ఆఖరి రెండు లీగ్ మ్యాచ్‌ల అనంతరం 13న ఎలిమినేటర్, 15న ఫైనల్ మ్యాచ్‌కు ముంబైలోని సీసీఐ స్టేడియం వేదిక కాబోతోంది. డబుల్ హెడర్స్, మధ్యాహ్నం మ్యాచ్‌లు ఏమీ లేని డబ్ల్యూపీఎల్-3లో మ్యాచ్‌లన్నీ రాత్రి 7:30 గంటల నుంచి మొదలవనున్నాయి.



# మహేష్ సినిమాలో ప్రియాంకా చోప్రా

## -అమెరికా నుంచి హైదరాబాద్‌కు వచ్చిన ప్రియాంకా

పాపులర్ అమెరికన్ సింగర్ నిక్ జోనస్‌ను పెళ్లి చేసుకున్న తర్వాత బాలీవుడ్ భామ ప్రియాంకా చోప్రా హాలీవుడ్‌కు పరిమితమైపోయిందని తెలిసిందే. ఈ భామ రీఎంట్రీకి రెడీ అయినట్టు ఇప్పటికే వార్తలు నెట్టింట హల్ చల్ చేస్తున్నాయి. అయితే ఈ బ్యూటీ ఫైనల్‌గా ఎస్ఎస్ఎంబీ 29తో మళ్లీ సిల్వర్ స్క్రీన్‌పై మెరిసేందుకు రెడీ అవుతుందని బీటౌన్ సర్కిల్ టాక్. ఈ నేపథ్యంలో ప్రియాంకా చోప్రా గురువారం సాయంత్రం టొరంటో నుంచి హైదరాబాద్‌లో ల్యాండైంది. దీనిక్కారణం మహేశ్ బాబు చేయబోతున్న కొత్త సినిమానేనట. ప్రియాంకా చోప్రా ఆర్ఆర్ఆర్ డైరెక్టర్ ఎస్-ఎస్ రాజమౌళి, మహేశ్ బాబు కాంబోలో వస్తోన్న గ్లోబల్ అడ్వెంచరస్ ప్రాజెక్ట్ ఎస్ఎస్ఎంబీ 29 అనౌన్స్‌మెంట్ ఈవెంట్‌లో పాల్గొనేందుకు హైదరాబాద్ వచ్చిందని నెట్టింట కథనాలు రౌండప్ చేస్తున్నాయి. ప్రియాంకా చోప్రా తప్పకుండా ఎస్ఎస్ఎంబీ 29లో భాగం కావాలని ఆ దేవుడిని ప్రార్థిస్తున్నానని నెట్టింట ఓ అభిమాని కామెంట్ చేయగా ఆమె ఫైనల్ అయిందని భావిస్తున్నా. అయితే మాత్రం అద్భుతమైనదని చెప్పాలి.. అని మరో అభిమాని కామెంట్ చేశారు. ఇదే నిజమైతే ఐదేళ్ల తర్వాత ప్రియాంకా చోప్రా చేయబోతున్న భారతీయ సినిమా ఎస్ఎస్ఎంబీ 29 కానుంది. మరి దీనిపై కొన్ని గంటల్లో క్లారిటీ వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. 2002లో తొలిసారి తమిళ సినిమాతో ఇండస్ట్రీ ఎంట్రీ ఇచ్చింది. ఈ బీహారీ సుందరి ఆ తర్వాత తన ఫోకస్ అంతా బాలీవుడ్‌పైనే పెట్టింది. తుఫాన్ సినిమాతో తెలుగు ప్రేక్షకులకు కూడా హాయ్ చెప్పింది. ఈ సినిమా కోసం మహేశ్‌బాబు ఇప్పటికే మేకోవర్ మార్చుకుని.. లాంగ్ హెయిర్, గడ్డం, పోనీ టెయిల్ లుక్‌లో కనిపిస్తూ సినిమాపై సూపర్ హైప్ క్రియేట్ చేస్తున్నాడు. ఆఫ్రికన్ అడ్వెంచరస్ ప్రాజెక్ట్‌గా రానున్న ఈ చిత్రాన్ని దుర్గా ఆర్ట్స్ బ్యానర్‌పై కేఎల్ నారాయణ తెరకెక్కిస్తున్నారు.





# లేడి గెటప్‌లో విశ్వక్ సేన్..

## బోల్డ్‌గా 'లైలా' టీజర్

గత ఏడాది మెకానిక్ రాకీతో విజయాన్ని అందుకున్న మాస్? కా దాస్ విశ్వక్ సేన్ మరో క్రేజీ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాడు. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'లైలా'. ఈ సినిమాకు దర్శకుడు రామ్ నారాయణ్ దర్శకత్వం వహిస్తుండగా.. సాహు గార్లపాటి నిర్మిస్తున్నారు. వాలెంటైన్స్ డే సందర్భంగా ఫిబ్రవరి 14న ఈ సినిమా థియేటర్లలో రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్.'మనకు తెల్లగా చేసుడే కాదు. తోలు తీసుడు కూడా వచ్చు' అంటూ టీజర్‌తోనే ఫుల్ ఎంటర్‌టైనమెంట్ ఉండబోతుందని చెప్పాడు విశ్వక్. బార్బర్ సోన్, లైలా అనే రెండు పాత్రల్లో విశ్వక్ ఇందులో కనిపించనున్నట్లు తెలుస్తుంది. ఇక మొత్తం డబుల్ మీనింగ్స్ డైలాగ్స్‌తో కట్ చేసిన ఈ టీజర్ ప్రస్తుతం వైరల్‌గా మారింది.

# మగాడితో పనేంటీ.. ఆ ఒక్కదానికే కావాలి..

సినిమా సెలబ్రెటీలు సినిమాలతోనే కాదు తమ వ్యక్తిగత విషయాలతోనూ ఎప్పుడూ వార్తల్లో నిలుస్తూ ఉంటారు. కొంతమంది యంగ్ బ్యూటీస్ ఓవర్ నైట్ లో స్టార్స్ అవుతున్నారు. మరికొంతమంది వరుసగా సినిమాలు చేస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. అలాగే మరికొంతమంది ముద్దుగుమ్మలు పాన్ ఇండియా హీరోయిన్స్ గా రాణిస్తున్నారు. ఇదిలా ఉంటే కొంతమంది పెళ్లి చేసుకొని కొత్త జీవితాన్ని ప్రారంభిస్తున్నారు. మరికొంతమంది డేటింగ్స్ తో గడిపేస్తున్నారు. అయితే ఇంకొంతమంది మాత్రం పెళ్లి అనే ఆలోచనలేకుండా గడిపేస్తున్నారు. వయసు పెరుగుతున్నా కూడా పెళ్లి, ప్రేమ అనేది లేకుండా తమ సినిమాలతో బిజీగా మారిపోయారు. ఇప్పటికే చాలా మంది హీరోయిన్స్ పెళ్లి చేసుకోకుండా సింగిల్ గా ఉండిపోయారు. అలాగే ఓ స్టార్ హీరోయిన్ కూడా పెళ్లి చేసుకోకుండా సింగిల్ గా ఉండిపోయింది. ఐదుపదుల వయసు వచ్చినా కూడా పెళ్లి చేసుకోకుండా ఉండిపోయింది. ఇప్పటికీ తరగని అందంతో కవ్విస్తుంది. తన వయ్యారాలతో కుర్ర హీరోయిన్స్ ను కూడా అవాక్ అయ్యేలా చేస్తుంది. ఇంతకూ ఆమె ఎవరో తెలుసా.? తెలుగులో ఆమె చేసింది తక్కువ సినిమాలే కానీ మంచి గుర్తింపు తెచ్చుకున్న భామల్లో టబు ఒకరు. వెంకటేష్ హీరోగా నటించిన కూలి నెంబర్ వన్ సినిమాతో టాలీవుడ్ కు పరిచయం అయ్యింది.ఆతర్వాత నిన్నే పెళ్లాడతా, ఆవిడా మా ఆవిడే, చెన్నకేశవరెడ్డి,అందరివాడు,షాక్, ఇదీ సంగతి, పాండురంగడు సినిమాలు చేసింది. తెలుగుతో పాటు తమిళ్, హిందీ భాషల్లోనూ సినిమాలు చేసింది. ఇప్పుడు ఈ బ్యూటీ వయసు 50ఏళ్లకు పైనే.. ఇప్పటికీ హాట్ లుక్స్ తో ఆకట్టుకుంటుంది. టబు ఇప్పటికీ హిందీలో సినిమాలు చేస్తున్నారు టబు. వైవాహిక జీవితమే ఓ మనిషి లైఫ్‌ను డిసైడ్ చేయదు. నా లైఫ్ గురించి వేరే వాళ్లు జడ్జ్ చేయడం ఇష్టం ఉండదు. రీసెంట్ గా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న టబు పెళ్లి గురించి షాకింగ్ కామెంట్స్ చేసింది. టబు మాట్లాడుతూ.. పెళ్లిపై ఆసక్తి లేదని, ఒక మగవాడితో బెడ్ షేర్ చేసుకోవాలని మాత్రమే కోరుకుంటున్నాను అని చెప్పుకొచ్చింది. సింగిల్ గా హ్యాపీగా లైఫ్ లీడ్ చేస్తున్నా.. ఇప్పటికీ కెరియర్ పై ఎక్కువ దృష్టి పెట్టాలని అనుకుంటున్నానని టబు తెలిపింది.





# పుష్ప-2లో మరో 20 నిముషాలు

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ప్రధాన పాత్రలో నటించిన రీసెంట్ బ్లాక్ బస్టర్ చిత్రం 'పుష్ప 2 ది రూల్' సుకుమార్ దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమాలో రష్మిక కథానాయికగా నటించింది. డిసెంబర్ 5న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే రూ.1850 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టిన ఈ చిత్రం రూ.2000 కోట్ల దిశగా దూసుకెళుతుంది. అయితే ఈ సినిమాకి సంబంధించి రీలోడెడ్ వెర్షన్ విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ సినిమాలో విడుదలకు ముందు డిలీట్ చేసిన 20 నిమిషాలను మేకర్స్ తాజాగా యాడ్ చేశారు. ముందుగా జనవరి 11న యాడ్ చేద్దామనుకున్నా అనుకోని కారణాల వలన జనవరి 17కి వాయిదా వేసింది. తాజాగా 20 నిమిషాల డిలీటెడ్ సీన్స్ థియేటర్ వెర్షన్‌లో కలిపింది. అయితే ఈ సీన్స్‌లో ఒక హైలెట్ సీన్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆ సీన్ ఎంటంటే.. పుష్ప పార్ట్ 1లో.. పుష్ప రాజ్(అల్లు అర్జున్) మెడలో ఉన్న లాకెట్‌ను అతడి అన్నయ్య (అజయ్) కోపంతో తీసుకోని వెళతాడు. అయితే అదే చైన్‌ను తీసుకువచ్చి పార్ట్ 2 క్లైమాక్స్‌లో పుష్పరాజ్ మెడలో వేస్తాడు అజయ్. ఈ సన్నివేశాన్ని విడుదల ముందు కట్ చేశారు మేకర్స్. మరోవైపు సుకుమార్ ఈ విషయం ఎలా మార్చిపోయాడు అంటూ విడుదల తర్వాత దీనిపై చర్చ కూడా జరిగింది. అయితే కొత్తగా యాడ్ చేసిన వాటిలో ఈ సీన్ కూడా ఉండడంతో ఫ్యాన్స్ ఫుల్ ఖుషి అవుతున్నారు.

Printed published and woned by Tarigolpula Lakshmi, mahender ,printers karshak Art Printers, Hyderabad and published by office 2-6-376, Jaipuri colony,Nogole village,Uppal mandal, district Ranga Reddy,Post GSI,500068-Telangana RNI NO.APTEL/2012/46853 . Email ID : Prajaswecha@gmail.com, website, www.Prajaswecha.com cell 9381910611, 79892 89492